
ఆంధ్ర ప్రదేశ్









సంపుటి 3
సంచిక 8

జూన్, 1959 - ఆషాఢము,
శాలివాహన శకము — 1881.

ప్రదేశ సమాచార పౌర సంబంధముల శాఖచే



1—11—56 న అప్పటి రాష్ట్ర గవర్నరు శ్రీ కళా వెంకటరావుగారిచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం.



20—3—57 న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆర్థిక శాఖామంత్రిగా బడ్జెట్ ప్రసంగం చేస్తున్న శ్రీ కళా వెంకటరావు.



ఆంధ్రప్రదేశ్

జూన్, 1959

సంపుటి 3 — సంచిక 8

ఆషాఢము, శాలివాహనశకము-1881

ఈ సంచిక 1959 మార్చి 28 న
దివంగతులయిన శ్రీ కళా వెంకటరావు గారి స్మారకార్థం
వెలువరించబడుతున్నది.

విషయసూచిక

ముఖచిత్రం

24-10-58 న హైదరాబాదు గ్రీన్‌లాండ్స్‌లో జరిగిన విందు సందర్భంలో భారత ప్రధానితో శ్రీ కళా వెంకటరావుగారు.

— చందా వివరాలు —

సంవత్సరానికి 2 రూపాయల 16 నయాపైసలు

విడిప్రతి వెల 18 నయాపైసలు

ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధములశాఖచే ప్రచురింపబడి సిటిజన్ ప్రెస్‌లో ముద్రింపబడినది.



రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ 17-7-58 న సికిందరాబాదు రైలు స్టేషనునుంచి ఢిల్లీ బయలుదేరుతున్నప్పుడు యితరులతో పాటు అక్కడికి వెళ్లిన శ్రీ కళా వెంకటరావుగారు.

సందేశములు

"సమర్థుడు, సేవాపరాయణుడు"

శ్రీ కళా వెంకటరావు అస్తమయ వార్తను విని చింతించానని రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్ ఆంధ్రప్రదేశ్ గవర్నరుకి పంపిన తంతిలో తెలియ జేశారు. ఆంధ్ర దేశం సమర్థుడు సేవాపరాయణుడు అయిన వ్యక్తిని కోల్పోయినదని కూడా ఆయన అన్నారు. "స్వర్గీయులయిన వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియ చేయండి" అని ఆయన కోరారు.

"అకుంఠిత దేశభక్తుడు"

"ఆంధ్రప్రదేశ్" యీ ప్రత్యేక సంచికకు పంపిన సందేశంలో భారతదేశ వుప రాష్ట్రపతి డా. ఎస్. రాధాకృష్ణన్ యిలా అన్నారు.

"శ్రీ కళా వెంకటరావు నిర్యాణంతో దేశం ఒక ప్రసిద్ధ దేశభక్తుని ప్రముఖ ప్రజా సేవకుని కోల్పో యింది",

'త్యాగధనుడు'


ఈ ప్రత్యేక సంచికకు పంపిన సందేశంలో రాష్ట్ర గవర్నరు శ్రీ భీమసేన సచార్ యిలా అన్నారు :

"శ్రీ కళా వెంకటరావుగారు దివంగతులు కావడంతో దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, ఆంధ్ర,

ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రాల నిర్మాణంలోనూ ప్రముఖ పాత్ర వహించిన వెనుకటి తరంది రాజకీయ ధురంధరుడు ఆంధ్రప్రదేశ్ ప్రజా సేవా రంగంనుంచి నిష్క్రమించడం జరిగింది.

"ఆయన ఆంధ్రలో కాంగ్రెసుపార్టీ తొలి నిర్మాతలలో ఒకరు. మహాత్మాగాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనుటకై 1921 లో చదువు మానేశారు. అప్పటినుంచీ ఆంధ్రలో కాంగ్రెసు నిర్మాణానికి, దానిని బలపరచ డానికి ఆయన తమ జీవితాన్ని అంకితం చేశారు. గడ్డు కాలమయిన రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం కార్యదర్శులలో ఒకరుగా ఆయన పనిచేశారు. ఆయన ప్రజ్ఞావంతుడయిన పార్టీ పెద్ద. ఉద్యమం నడపడంలో సమర్థుడు. ఆంధ్రలో 1942 'క్విట్ ఇండియా' వుద్యమం వెనుక ఆయన ప్రజ్ఞా ప్రభావాలు వున్నాయి. తరువాత ఆయన 1949 నుంచి 1951 వరకూ అఖిలభారత కాంగ్రెసు సంఘం కార్యదర్శులలో ఒకరుగా పని చేశారు. ఆ హోదాలో ఆయన యెంతో చక్కని కృషి చేశారు. అప్పుడే ఆయనతో నాకు వ్యక్తిగతమయిన పరిచయం కలిగింది.

"సమష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా ఆయన జమీందారీ రద్దు చట్టాన్ని చేసి దక్షిణ భారతంలో చిరకాలంగా వున్న జమీందారీలకు స్వస్తి చెప్పేమార్గం యేర్పరచారు ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ తలపెట్టిన భూసంస్కరణల బిల్లు తయారీ బాధ్యత ఆయనకు అప్పగించ బడింది. కష్టమయిన యీ బిల్లును చట్టం చేసి రైతులకు మేలు చేయాలని ఆయన యెంతో వాంఛించారు, కాని ఆపని పూర్తి కాకుండానే దుర్విధి ఆయనను కబళించింది.



5.12.58 న శ్రీ కళా వెంకటరావు హైదరాబాదు జిల్లా మేడ్చల్ లో అస్ప్రతి భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం.



21.5.67 న శ్రీ కళా వెంకటరావు ఆంధ్రకేసరి శ్రీ టి ప్రకాశం భౌతిక కాయంపై పుష్పమాలను వుంచుతున్న దృశ్యం.

"శ్రీ వెంకటరావుగారు విద్యుక్త ధర్మ నిర్వహణపారాయణుడు అతి మూత్ర వ్యాధితో ఆయన ఆరోగ్యం యెంత దెబ్బతిన్నా లక్ష్యం చేయక ఓపిన కంటే యెక్కువ పనిని చేసి ప్రాణంమీదకి తెచ్చుకున్నారు మంత్రి వర్గంలో ప్రణాళికల మంత్రిగా, ఆర్థిక, రెవిన్యూ మంత్రులుగా ఆయన అమోఘమయిన సేవచేశారు పార్లమెంటరీ వ్యవహారాలలో ఆయన మహా ప్రజ్ఞాశాలి ఆయన వ్యవహరించే విషయాలు ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. భావ వ్యక్తీకరణ సౌలభ్యం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అందువల్ల ప్రభుత్వ పక్షానికి ఆయన పెద్ద అండగా వుండేవారు ఒకరిని నొప్పించని సుస్వభావంవల్ల రాజకీయ ప్రత్యర్థులతో సహా సర్వులకు ఆయన ప్రేమాస్పదులయారు

"ఆయన జీవితాన్ని సేవాత్యాగాలకు అంకితం చేసిన ధన్యుడు"

'విశిష్టపాత్ర'

బొంబాయి గవర్నరు శ్రీ శ్రీ ప్రకాశ దిగువ సందేశం పంపారు.

"శ్రీ కళా వెంకటరావుగారు కాకలు దీరిన దేశ భక్తుడు, ప్రజాసేవకుడు. ఆయన దివంగతులు కావడంతో ఒక్క ఆంధ్రకేకాక మొత్తం దేశానికే లోటు కలిగింది దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన విశిష్ట పాత్ర వహించారు. వివిధ రంగాలలో విశిష్టతను గడించారు

"వ్యక్తిగతంగా ఆయనంటే నాకెంతో గౌరవం. ఆయన ఆకస్మిక మరణవార్త విని స్తంభించి పోయాను. ఆయన ఆంధ్రాభిమాని అయినప్పటికీ మొత్తం దేశం నిమిత్తం కృషి చేసేటప్పుడు సంకుచితమైన రాష్ట్రాభిమానాన్ని కాని కులతత్వాన్ని

కాని అందుకు అడ్డురానీయలేదు. ఆయన నడవడిక మనకు మార్గదర్శక మవుగాక."

'సాటిలేని మేటి'

కేరళ గవర్నరు డా॥ బి రామకృష్ణారావుగారు దిగువ సందేశం పంపారు -

"స్వర్గీయ శ్రీ కళా వెంకటరావుగారి స్మృతి చిహ్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాలశాఖ ఒక స్మారక సంచిక ప్రచురణకు పూనుకోవడం ముదావహం. ఆపత్రికలో ప్రకటనార్థం ప్రగాఢ విచారంతో యీ సందేశాన్ని పంపుతున్నాను

"శ్రీ కళా వెంకటరావుగారు రెండు రోజుల సుస్తీతో హఠాత్తుగా మృత్యుదేవత క్రూర దంష్ట్రలకు యెర అయినారు. ఇంక రెండు గంటలకు పోతారనగా కూడా ఆయన మిత్రులతో కులాసాగా మాట్లాడుతూనే వున్నారు, నిజానికి జీవితమంతా ఆయన అలాగే గడిపారు. అలాగని తీవ్రమయిన విషయాలు ఆయనకు తెలియవని కాదు, నిజానికి బాల్యదశ గడిచాక మిగిలిన నాలుగు దశాబ్దాల కాలం ఆయన జీవితం దేశ రాజకీయాలతో ముడిపడి వుంది స్వాతంత్ర్యోద్యమ సమయంలోనూ నిర్మాణాత్మక రాజకీయ రంగంలోనూ కూడా ఆయన ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొన్నారు ఆంధ్ర రాజకీయ రంగంలో ఆయన సాటిలేని మేటి సమిష్టి మద్రాసు రాష్ట్రంలో తమిళులకు ఆంధ్రులకు మధ్య సామరస్య సాధనకై ఆయన చాల కృషి చేశారు దేశభక్తుడుగా, గట్టి కాంగ్రెసు వాదిగా ఆయన గడించిన కీర్తి దేశవ్యాప్త మయినది, ఆయన ఘనతను దేశమంతా గుర్తించి ప్రశంసించింది ఆయన విశాల దృక్పథం, సిద్ధాంతాలు, భేదించినప్పటికీ యెదుటి వారిపట్ల ఆయన ప్రదర్శించిన సహన భావాలను ఆయనతో పరిచయంగల వారెవరూ మరిచిపోరు ఆయనతో



28-3-59 న శ్రీ కళా వెంకటరావు భౌతిక కాయంపై పుష్పమాలను వుంచుతున్న రాష్ట్ర గవర్నరు



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి

30 సంవత్సరాల క్రిందట నాకు కలిగిన పరిచయం క్రమేపీ అమూల్యమయిన మైత్రిగా మారింది నమ్మకమయిన గొప్ప సహచరునే గాక సఖుడు, సారథి, దైవము అయిన వ్యక్తిని కోల్పోయానని మిత్రుడు శ్రీ సంజీవరెడ్డి అన్నమాటతో నేను ఏకీభవిస్తాను శ్రీ కళా వెంకటరావు లేని లోటు తీరడం కష్టం. ఆయన ప్రజ్ఞా ప్రభావాల నెరిగినవారందరూ నాతో ఏకీభవిస్తారని నమ్ముతాను ఆయన అందరినీ తమతో కలుపుకోగల సమర్థుడు జయాపజయాలు రెండిటిలోనూ కూడా ఆయన ప్రత్యర్థులే మెచ్చుకునే విధంగా ప్రవర్తించేవారు ఆయన మామూలుగా కష్టమయిన జైలు జీవితం వల్ల కలిగే యిబ్బందులకు లోనైనా కాలధర్మం చెందేసరికి ఆయన వయస్సు 58 సంవత్సరాలు మాత్రమే. ఆయనకంటే పెద్దవారయిన మేమెవరం యిలా జరుగుతుందని అనుకోలేదు మిత్రులందరితోనూ నేను ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను ఏ 'కళా' కోసం మనం పరితపిస్తున్నామో ఆ 'కళా' ఆత్మకు పరమేశ్వరుడు శాంతిసౌఖ్యాలు ప్రసాదించుగాక '

'పరిపాలనా ధురంధరుడు

పశ్చిమ బెంగాలు గవర్నరు కుమారి పద్మజా నాయుడు తమ సందేశంలో యిలా పేర్కొన్నారు

"స్వర్గీయ శ్రీ కళా వెంకటరావు స్మారకార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురిస్తున్న "ఆంధ్రప్రదేశ్" ప్రత్యేక సంచికకు సందేశం పంపడం నాకు సంతోషకరంగా వుంది

"ఆంధ్రులు శ్రీ కళా వెంకటరావుగారిని రాజనీతి కోవిదుడుగా, పార్లమెంటరీ వ్యవహర్తగా, విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా, అన్నిటికీ మించి పరిపాలనా ధురంధరుడు చిరకాలం జ్ఞాపకం పెట్టుకుంటారు "

'ధీరాగ్రణి'

ఉత్తర ప్రదేశ్ గవర్నరు శ్రీ వి వి గిరి దిగువ సందేశం పంపారు

నాకు గౌరవ భాజనుడైన మిత్రుడు స్వర్గీయ శ్రీ కళా వెంకటరావు స్మారకార్థం ఆంధ్ర ప్రభుత్వం "ఆంధ్ర ప్రదేశ్" ప్రత్యేక సంచికను వెలువరించ సమకట్టడం సంతోషదాయకం

"శ్రీ కళా వెంకటరావు మృతిపట్ల ఒక్క ఆంధ్రకే కాక మొత్తం దేశానికే నష్టం దేశసేవలో సర్వస్వాన్ని త్యాగం చేయాలనే అభిలాష ఆయనకు మొదటినుంచీ వుంది కళాశాలలోనూ, బయటా కూడా అభివృద్ధి కరమయిన జీవితాన్ని వదులుకొని ఆయన స్వాతంత్ర్యోద్యమం తొలి ఘట్టాలలోనే 1921 లోనే దానిలో చేరారు ఆయన గొప్ప యోచనాపరుడు తన ఆదర్శాలను యెన్నడూ యేమరక శాయశక్తులా పాటుబడి యెంత త్యాగమయినా చేసి వాటిని సిద్ధింపచేసుకొనే వారు ఆయన ఒకరి ప్రాతికూల్యానికి భయపడి యెరుగరు. తాను చేపట్టిన పనిని యెంత త్యాగమయినా వెనుదీయక సాధించే ధీరుడు ఆయన కాంగ్రెసులో క్రమేణా పైకివచ్చారు శ్రీ ప్రకాశం నాయకత్వాన రాష్ట్ర కాంగ్రెసు సంఘం కార్యదర్శిగా పనిచేశారు 1939-40 సత్యాగ్రహోద్యమంలో వేలాది కాంగ్రెసు వాదులు, నాయకులు, అనుయాయులు పాల్గొని తమ్ముడుంగా జైలుకు వెళ్లడానికి చాలా మట్టుకు ఆయనే కారణం గొప్ప శాసన నిర్మాత, సాధారణ సభ్యుని హోదాలో ఆయన సహకార, రెవిన్యూ రంగాలలో యెంతో సేవచేశారు 1937-39లో మద్రాసులో నేను సహకార మంత్రిగా వుండగా సహకారం అన్ని అంశాలను పరిశీలించి సహకారరంగాన్ని సర్వవిధాలా విస్తరింపచేసే సిఫార్సులను అన్వేషించడానికి ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది ఈ సందర్భంలో శ్రీ వెంకటరావు తన విజ్ఞానానుభవాలతో యెంతో తోడ్పడ్డారు. శ్రీ విజయరాఘవాచారి, శ్రీ రామలింగం చెట్టియార్, శ్రీ ఎస్ సత్యనారాయణ ప్రభృతులు



దీర్ఘనిద్ర



హైదరాబాదు యింట్లో శ్రీ కళా వెంకటరావుగారి భౌతిక కాయం చుట్టూ చేరిన బంధుమిత్రులను చిత్రంలో చూడవచ్చు.

తొలి నివేదికను. యెడిట్ చేశారు. అది తరువాత మొత్తం దేశానికి, రాష్ట్రానికి వుపకరించింది. తన ప్రాంతాలలో ఆయన సహకార సంఘాలు, సహకార బ్యాంకులు, మార్కెటింగు సంఘాలను విరివిగా యేర్పరచారు. జమీందారీలను రద్దుచేయాలని రెవిన్యూ మంత్రిగా శ్రీ టి. ప్రకాశం మొదట చేసిన ఆలోచనకు ఆయన రూప కల్పన చేశారు. ఈనాడు మద్రాసులోను అటుపిమ్మట ఆంధ్రలోను ప్రవేశపెట్టిన శాసనాలతో రెవిన్యూ విధానం భావి రంగం సమస్యలు విజయవంతంగా పరిష్కార మయినవి.

"అఖిలభారత కాంగ్రెసు సంఘం కార్యదర్శిగా పని చేయుటకై శ్రీ కళా వెంకటరావు ఒకసారి మద్రాసు ప్రభుత్వం (వుమ్మడిరాష్ట్రం) లో మంత్రి పదవికి రాజీనామా యిచ్చారు. అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శిగా ఆయన యెంతో చక్కని కృషి చేశారు. ప్రసిద్ధులయిన యితర రాజకీయ వేత్తలు, నాయకులవలెనే ఆయనా అవిరామంగా శ్రమపడ్డారు, దానితో దేహారోగ్యం దెబ్బతింది. దేశ చరిత్రలో ముఖ్యంగా ఆంధ్రదేశ చరిత్రలో ఆయనకు ఒక ప్రత్యేకస్థానంవుంది. ప్రజలకు అది సర్వదా జ్ఞాపకం వుంటుంది. చివరిక్షణంవరకూ ఆయన రాష్ట్రం అప్పగించిన పనిని నమ్మకంగా చేస్తూనేవున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆయన లేని లోటును తీర్చడం చాల కష్టం. భారతదేశ ప్రజలు ఆయన సేవను కృతజ్ఞతతో స్మరిస్తారు".

'గొప్ప వక్త'

మద్రాసు గవర్నరు శ్రీ విష్ణురాంమేధి దిగువ సందేశం పంపారు :


"స్వర్గీయ శ్రీ కళా వెంకటరావు స్మారకార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ "ఆంధ్రప్రదేశ్" ప్రత్యేక సంచికను వెలుకరిస్తున్నదని తెలుసుకుని సంతోషించాను.

"శ్రీ వెంకటరావు కాంగ్రెసు ఆదేశాన్ని మన్నించి బి ఏ చదువును మానివేసి ఉద్యమంలో చేరి పెక్కుసారులు జైలుకు వెళ్లారు ఆయన దేశానికి అనేక హోదాలలో సేవచేశారు సమిష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూమంత్రిగా జమీందారీ రద్దు బిల్లును శాసనం చేశారు అయన సమర్ధుడయిన పరిపాలకుడు, గొప్ప వాక్చాతుర్యం కలవాడు ఆయన అకాల మరణంవల్ల మొత్తం దేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కి తీరని నష్టం కలిగింది నేను సన్మిత్రుని కోల్పోయాను"


'ఆచి తూచిన నిర్ణయాలు'

పంజాబు గవర్నరు శ్రీ ఎస్ వి గాడ్గిల్ సందేశం

"శ్రీ కళా వెంకటరావుగారిని నేను 20 సంవత్సరాలనుంచి యెరుగుదును కాని ఆయన రాజ్యాంగ సభలో సభ్యుడు అయిన పిమ్మటనే నాకు ఆయనతో సన్నిహిత సంబంధం యేర్పడింది భారత జాతియ కాంగ్రెసుకి డా పట్టాభి సీతారామయ్య అధ్యక్షుడుగా యెన్నికయిన పిమ్మట శ్రీ వెంకటరావు దానికి కార్యదర్శి అయినప్పుడుకూడా నాకు అయనతో సన్నిహితత్వమేర్పడింది ఎంతో ప్రశాంతంగా ఆచి తూచి నిర్ణయాలను చేస్తూ, చేపట్టినపనికి రక్తాన్ని ధారపోసే మనిషి-శ్రీ కళా వెంకటరావు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం యేర్పాటుకి పూర్వం తుపానువంటి ఆంధ్ర రాజకీయాలలో క్లిష్టమయిన ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో అతిమిత వాదాలకు మధ్యస్థంగా వెళ్లిన బహుకొద్దిమందిలో ఆయన ఒకరు ఆయన పరిపాలనా సామర్థ్యం గొప్పది నూతనాంధ్రరాష్ట్రానికి అశేషమయిన ఆయన ప్రజ్ఞాప్రాభవాలు తోడ్పడ్డాయి ఆంధ్ర దేశానికి కలిగిన నష్టం అపారమయినదే కాని దేశానికి కూడా పెద్ద నష్టమే కలిగింది ఎందువల్లనంటే స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన రెండవతరం నాయకులు అస్తమిస్తున్నారు ఎన్నో కష్టాలుపడి,



23 3 59 ఉదయం భౌతిక కాయం హైదరాబాదు యింటి నుంచి అమలాపురం తీసుకొని వెళ్లబడుతున్నది



ఏలూరు ప్రజల శ్రద్ధాంజలి (భౌతికకాయం ఏలూరు మీదుగా తీసుకుని వెళ్లబడింది)

యెంతో త్యాగంతో సంపాదించిన స్వాతంత్ర్యాన్ని పటిష్ఠం చేసుకోడానికి యింకా కొంతకాలం పడుతుంది. ఇప్పుడు మనం స్వాతంత్ర్యంనుంచి సౌభాగ్య పథానికి సాగిపోవాలి. ఈ బృహత్తర కార్యంలో శ్రీ వెంకటరావు శాయశక్తులా తోడ్పడుతున్నారు. ఆయన లేని లోటును తీర్చడం కష్టం"

'గొప్ప జాతీయవాది'


మధ్యప్రదేశ్ గవర్నరు శ్రీ హెచ్.వి పటాస్కర్

"స్వర్గీయ శ్రీ కళావెంకటరావు దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర వహించారు. స్వాతంత్ర్య సముపార్జన పిమ్మట శాసన నిర్మాతగా, పరిపాలకుడుగా ఆయన సమాన దక్షతను ప్రదర్శించారు. ప్రధాన జాతీయ సంస్థ (కాంగ్రెసు) లో ఆయన కృషి ప్రత్యేకం పేర్కొనదగినది. ఆంధ్ర, మద్రాసు సరిహద్దు వివాదం సందర్భంలో యిటీవల నాకు ఆయనబాగా సన్నిహితులయారు. ఆ వివాదం స్నేహపూర్వకంగా పరిష్కారం కావడానికి ఆయన వుచితజ్ఞత ముఖ్యకారణం. బహుసమర్థుడయిన పరిపాలకుడు, గొప్ప జాతీయవాది అయిన అట్టి వ్యక్తి షష్టిపూర్తి అయినా కాకుండానే మృతిచెందడం దురదృష్టమే. ఆయన నిర్యాణంవల్ల ఆంధ్రప్రదేశ్ కే కాక మొత్తం దేశానికే నష్టం కలిగింది"

'సమయజ్ఞుడు, ఉచితజ్ఞుడు'

డా. పి. సుబ్బరాయన్ సందేశం

"శ్రీ కళా వెంకటరావుగారిని నేను చిరకాలంగా యెరుగుదును. నాకు తెలిసినవారిలో మన స్ఫూర్తిగా పనిచేసేవారిలో ఆయన ఒకరు. స్వాతంత్రోద్యమం అంటే ఆయనకు యెంత ఆతురతఅంటే యింకా చదువు పూర్తి కాకుండానే దానిలోకి వురికారు. దేశంకోసం యెన్నోసార్లు సంతోషంతో శ్రీకృష్ణ జన్మస్థానాన్ని అలంకరించారు. 1947-48లో, మద్రాసు మంత్రివర్గంలో ఆయన నాసహచరుడు. తన పోర్టు ఫోలియోకు సంబంధించిన సర్వ విషయా




స్వర్గీయ శ్రీ కళా వెంకటరావుని తుదిసారి దర్శిస్తున్న అమలాపురం ప్రజానీకం.

లను ఆయన యెంతో శ్రద్ధతో చూచేవారు. మద్రాసు శాసనసభలో జమీందారీల రద్దుబిల్లు చట్టం అయినప్పుడు ఆయనతో నాకు సన్నిహిత సంబంధం వుండి. ఉత్పన్నమయిన సర్వ సమస్యలు ఆయనకు తెలుసు, ప్రతి అభ్యంతరానికి ఆయన జవాబు చెప్ప గలిగేవారు. క్లిష్టమయిన సమస్యలో ఆయనకుగల పరిజ్ఞానానికి నేను ముగ్ధుడనయేవాడను. విభేదా లున్నప్పటికీ, తాబట్టిన కుందేటికి మూడే కాళ్లని వాదించే స్వభావం లేదాయనకు. తాను వుచితమని నమ్మిన విషయాలను నాకు నచ్చచెప్పేవారు. అన్ని విషయాలలోను సుహృద్భావంతో పని చేయడం వల్లనూ, యెదుటివారి దృక్పథాన్ని అర్థం చేసుకునే స్వభావం కలిగివుండడంవల్లనూ ఆయనతో కలిసి పని చేయడమంటే నాకు యిష్టంగా వుండేది. ఇంకా యెంతోకాలం సేవచేయవలసిన మనిషి యిప్పుడే దాటిపోయారు. దానితో దేశం ముఖ్యంగా ఆంధ్ర దేశం ప్రతి మంచి పనిని విసుగు విరామం లేకుండా చేసే వ్యక్తిని కోల్పోయింది"

కీర్తిశేషులు శ్రీ కళా వెంకటరావు

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు

జీవిత యాత్ర ఒక శాస్త్రమా లేక కళా, ఒక కవిత్వమా లేక తత్త్వమా, ఏవీ కాక, ఒక కొంటితన మనదగిన చెలగాటయా లేక అన్ని సమపాళ్లుగాగల ఒక పాకమా? పాకమైతే పాళ్లు ఏవేవి? సామాన్యముగ మన మిట్టి సమస్యలు తేల్చుటయందు సగటున ఎంత కనుపించునో అంత మాత్రమే లెక్కలోనికి తీసుకొందుముగదా! ఈ ప్రాప్తిని, పురుషుల జీవితమును పరిశీలించునపుడు, స్త్రీ కందుండు భాగము యోచించుదుము. స్త్రీల జీవితమును పరిశోధించుటలో పురుషుని వాటా ఎంతయో, ఎంతగా నుండునో యోచించుదుము, 'ఉభయుల జీవితములను పరిగణించుటలో కాంచనము యొక్క బలమెంత? ఈ రెంటిని కలుపుకొన్న పిమ్మటనే జీవిత మున్నది. త్రికోణ రూపము దాల్చి చిరస్థాయిగ నుండగల నిర్మాణముగ కనిపించును. ఆ పైననే గదా పరోపకార బుద్ధి, సేవాతత్పరత, భగవచ్చింత, మున్నగు స్వార్థరహితములగు గుణపుంజములకుండు అవకాశము గాని, అవశ్యకముగాని, గలదా యని యోచన సేయుదుము-లేదా వీని అన్నిటితోను-నిష్పత్తి నియమములను అనుసరించి, నిర్మింపబడు సౌధమా? అట్టిచో ఇట్టి సర్వ సౌకర్య శోభితమగునట్టియు, సర్వ సంపన్నయుత మగునట్టియు సమ్మేళనము ప్రతి వ్యక్తియందు నుండగలదా? లేకున్న వ్యక్తిద్వయముగాని, వ్యక్తి త్రయముగాని, వ్యక్తి



చింతాక్రాంతులయిన ప్రజలు—అమలాపురంలో



ముక్కామలలో స్వగృహంలో

రూపముగా తనయందు లేని గుణ విశేషములను, సంఘ సంయుక్తతచే, కూడబెట్టుకొనగలదా?

జీవయాత్ర జయప్రదముగ, జరుపుటకు ఏదైన ఆదర్శము—లుండవలెను గదా! ఆదర్శములుండునప్పుడే కదా వానిని సిద్ధింపజేయుటకు తగిన సామగ్రిని మనుష్యుడు చేకూర్చుకొనగలడు. కాని ఇట్టి ఆదర్శము అనేక సందర్భముల ననుసరించి నిర్ణీతమగును. దేశకాల పాత్రలు - మన సభ్యతతో అనుశ్రుతముగ వచ్చుచున్న పరిస్థితులని ఎల్లరకు విదితమే. ఒక్క దేశములోనే అనేక విధములు ఆదర్శములుండ గలవు. ఒక్క కాలము నందే వివిధములగు ఆదర్శములుండ వచ్చును. ఇవి రెండును కాక, వ్యక్తిగతమగు మార్పులు - ఒక్క దేశము నందే - ఏక కాలము నందే అసంఖ్యాకములుగ నుండదగును.

ప్రాతిపదకములో, మానవుని సృష్టి యొక్క ప్రత్యేక స్వభావము నాలోచింతము. "ఆహార నిద్రా భయ మైధు నంచ - సామాన్యమేతత్ పశుభిర్నరాణాం" అను శ్లోకము నిత్య సత్యముగా ప్రజలెల్ల ఎరిగినదే. పిపీలికాది బ్రహ్మ పర్యంతం తిండికోసము పడే తిప్పలు వర్ణనాతీతములు. ఆహారము లేకున్నా నిద్ర తప్పదు. ఆశ అనేది మానవుని హృదయము నందున్నంతవరకు అది తీరదేమో అని భయము. ఈ రెండును జీవితమనే పతకము యొక్క రెండు వైపులు, తిరగా బోర్లా అని అంటాము వీటిని. ఇంక నాల్గవది సంతానమనే లోక వ్యాప్తి చెందిన కోరిక అంటూ ఉన్నదే - అట్టి కోరికను తీర్చుకొనుటకు సాధనము. మానవ కోటిలో వీటికి అతిరిక్తమగు కొన్ని విశేషములు గలవు. సదసద్వివేకము, యుక్తాయుక్త విచక్షణ, ప్రమాణ జ్ఞానము లేదా ఇంతకంటే సులభమగు మాటలలో చెప్పుకుంటే మంచి చెడ్డలు, ముందు వెనుకలు, పిన్న పెద్దలు అనే తారతమ్యములు, మనిషి యొక్క శీలమునకు ఆధార భూతములగు లక్షణములు. ఎవరి జీవితమయినా సార్థకమయినదా లేదా అను విషయము నిర్ణయించునపుడు, యీ మూడు జంటలు ఆయన గారి జీవితములో ఎంతవరకు గమనింపబడుచున్నవో




ముక్కామల స్వగృహంలో—మరొక దృశ్యం


అంతవరకే, ఆ జీవితము సార్థకమగుచున్నదని మనము తెలుసుకోగలము.

వెంకటరావుగారికి ఇంకా షష్ఠిపూర్తి కాలేదు. నేడో రేపో జరపవలెనని మిత్రులు ఆప్తులు యోచించుచుండగనే భూమిపైన ఆయనకు ఏర్పడిన అన్నవస్త్రములు పూర్తిఅయినవి. మనము తినే ప్రతి మెతుకుమీదను, మనము త్రాగేప్రతి బొట్టు మీదను మన పేరు వ్రాసి ఉన్నదని పర్షియా లోను మన భాషలలోను కూడా సామెతలు కలవు. ఒకటి రెండు ఉదాహరణలు ఇస్తాను. తండ్రి తహశ్శీలుదారు. రాజమహేంద్రవరం తాలూకానుండి రామచంద్రపురం తాలూకాకు బదిలీ అయింది. నలుగురి కుమాళ్లలో పెద్ద అబ్బాయి - బండి ఎక్కి అందరు ఇల్లు వదిలి ప్రయాణం సాగిస్తున్నారు అనగా, ఒక్కసారి నిండు గోదావరిలో ఈత గొట్టి వస్తానని ఇంటి వద్ద చెప్పి స్నేహితులతో బయలు దేరి ఈ ఒడ్డునుంచి ఆ ఒడ్డుకు వెళ్లి తిరిగిరావడపు కుతూహలముతో వెళ్లాడు. సగము దూరము తిరిగి రాకముందే అలసట గలిగి గోదావరమ్మ పొట్టలో విశ్రాంతి గైకొన్నాడు. వడ్డించిన విస్తరి వదిలిపెట్టి వెళ్లవలసి వచ్చిన సందర్భము లనేకములున్నవి. వైద్యపు వృత్తిలో నున్న నావంటి వానికి ఇట్టి అభ్యంతరము లనేకములుంటవి. ఇది విధి, ఖర్మము, అని సంతృప్తి పొందుతాము. ఇట్లు నక్షత్రముల యొక్కయు, గ్రహముల యొక్క వశీకరణచే, మానవుని జీవిత విధానము నందలి మంచి చెడ్డలు- నిర్ణయింపబడునని పెద్దలు చెప్పుదురు. జాతకము లను, సాముద్రికమును, నమ్మండి, నమ్మకపొండి, కొన్ని విషయములను జీవిత చరిత్రలో సమంజస పఱచుట, వేరు విధముల సాధ్యము కాదు.

వెంకట్రావుగారు చిన్నతనములో తల్లిని గోల్పోయిన 'ఏతీం', అనగా పెద్ద పురుడులోనే తల్లి చని పోయెనన్నమాట. తాతగారు స్థితిపరులు. తండ్రి గారు ద్వితీయ వివాహము చేసి కొనగా ఈ పసి




అంతిమ యాత్ర—ముక్కామలలో



అంతిమ యాత్ర—మరొక దృశ్యం

బిడ్డను తల్లి అప్పగారయిన పెత్తల్లి శైశవము నుండియు పెంచి మాతృలోపమును తెలియనియ్యకుండెను. తల్లి తండ్రిగారి ఆస్తి తల్లులకు సంక్రమించెను. తండ్రిగారికి 7, 8 ఎకరముల పల్లపు పొలము మాత్రమే కలదు. ఆస్తి అంతయు తల్లి నుండి రావడమే కాక, పెంచిన పెత్తల్లి తన దగ్గర సొమ్ము యావత్తు ఈయన గారిదే అని రూఢము చేసెను. సెంట్రల్ డెల్టాలో 40 ఎకరముల పల్లపు పొలం, తోట, దొడ్డి, ఇల్లు వాకిలి అంటే సామాన్యపు ఆస్తిగాదు. అందువల్ల చదువు సంధ్యల కొరకు గాని, భోజన వసతులకు గాని ఈయనకెట్టి లోపము నుండి యుండలేదు. తండ్రి మరో గ్రామములో-రాజోలు తాలూకాలో - రెండవ భార్యతో సంసారము జరుపుకొనుచుండ, ఈయన పెత్తల్లి చేతులలో ఆగర్భ శ్రీమంతునివలె పెరిగి పెద్దవాడుగా నుండెను. అమలాపురం తాలూకాలో ముక్కామల అన్న గ్రామములో పెత్తల్లిగారి తాలూకు మేడ, పొలం ఉండుటచే పాలన ఆ గ్రామములో జరుగుచుండెను. ఒక సోదరి మాత్రము గలదు. ఆమెను మేనరికము ఇచ్చి వివాహము చేసిరి. పెనిమిటి మతిస్థిరములేనివాడు. అయినను సంతానము లోటు లేకుండా, ఆమె వీరిఇంటనే కాపురము చేస్తున్నారు. తద్రీత్యా వెంకట్రావుగారికి ఇద్దరు ప్రయోజకులయిన మేనల్లుళ్లున్నారు. ఒకరు బి.యస్.సి. ప్యాసు అయి ఇంటివద్ద వ్యవసాయపు ఒడుదుడుకులకు లోబడకుండ, వెంకట్రావుగారిది, పెత్తల్లిగారిది, తమది ఈ ఆస్తులన్నిటిని ఏ అరవై యకరాలో మొత్తము, అక్కడే దాని పరిపాలనను చేస్తున్నారు. ఈతని అన్నగారు బి.యస్.సి. లో ఉత్తీర్ణులయి ఆంధ్రప్రదేశములో అసిస్టెంటు కెమికల్ ఎగ్జామినర్‌గా ఉద్యోగము చేస్తున్నారు హైదరాబాదులోనే ఉంటున్నారు. వెంకట్రావుగారికి మామూలుగా అందరివలెనే బ్రాహ్మణ-బాల్య-వివాహము జరిగి యుండెను. మేనరికమే ఈయనకు కూడ సంభవించెను. భార్య, రాజరాజేశ్వరమ్మ గారి తండ్రిగారి ఇల్లు ముక్కామలలో వీరింటికి ఎదురు

గానే ఉన్నది. దాంపత్యము యొక్క అనుకూలతను గూర్చి చెప్పనక్కరలేదు. భార్యా భర్తలమధ్యగల మైత్రి, పొందిక, కలయిక, ప్రేమ, ఆదర్శ ప్రాయములు. కాని దురదృష్టముచే సంతానము గలుగలేదు, ఇది తీరనిలోటుగ నుండెను. ఈ ప్రకారం కాలము గడుచుచుండగా దీనికితోడు దేశముయొక్క పరిస్థితులు కూడా వక్రగతి నవలంబించెను. ఈయన మెట్రిక్యులేషన్ పరీక్షలో నుత్తీర్ణుడై, విజయనగరంలో ఇంటర్ పరీక్ష చదివి ఉత్తీర్ణుడయి, బందరు నోబిల్ కాలేజిలో బి. ఎ. చదువుటకు వెళ్లెను. అంతలోనే నాన్ కోఆపరేషన్ అనే దేవత కళాశాల విద్యార్థులను పట్టి పీడింప సాగెను. 1922వ సంవత్సరములో బహిష్కార త్రియము అమలులోనికి రాగా, ఒక ప్రక్కన కొండా వెంకటప్పయ్యగారు, టి. ప్రకాశంగారు వంటి మహనీయులు తమ పట్టాలను రద్దు చేసుకుంటూ యుండ, ఇంకొక ప్రక్కన కళా వెంకటరావు, మొసలిగంటి తిరుమలరావు వంటి కళాశాలా విద్యార్థులు కళాశాలను బహిష్కరింప సాగిరి. ఆ సంవత్సరమే ప్రిన్సు ఆఫ్ వేల్సుగారి రాక. ఇట్టి రాకను బహిష్కార త్రయమునకు చేర్చి జైళ్లకు వెళ్లడానికి అది యొక పద్ధతిగ నిర్ణయింపబడగ, ప్రప్రథమముననే కారాగార ప్రవేశమును గోరి ప్రవేశించిన విద్యార్థి గణములో వీరు అది స్థానము వహించిరి. పదాదిపాటు వేలూరు, కడ్డలూరు జైదు ఖానాలలో గడిపి 1922 ఫిబ్రవరి ప్రాంతమున విడుదల అయిరి. ఇంక ఈ మెట్టుతో నాన్-కోఆపరేషన్ దేవాలయ ప్రవేశము గావించిరి. తిరిగి రాగానే రాజకీయ నాయకత్వము-వీరుభయులపైన బడెను. విడుదల అయినారన్న మాటేగాని కాంగ్రెసు విధానము అనుసరించి కార్యక్రమమును ఆచరణ లోనికి దెచ్చుటకు అనగా - కోటి మెంబర్లు కోటి రూపాయలు, 10 లక్షలు చాటాలు - వీటిని సమకూర్చుటలో కాలమంతా వ్యయమాయెను. పిమ్మట తొందరలు కొంచెము అణగిన పిమ్మట గుజ



భౌతిక కాయాన్ననుసరిస్తున్న ప్రజానీకం

రాత్ విద్యాపీఠపు బి. ఎ. పరీక్షకు కొందరు వెళ్లిరి. ఈ పీఠముకూడా బహిష్కార ఫలితముగ నుత్పత్తి ఆయిన సంస్థయే. వెంకటరావు ఈ పరీక్షలో నుత్తీర్ణులయిరి. ఇంతట్లో ఉప్పు సత్యాగ్రహం; వెల్లింగ్టన్ గారు వైస్రాయిగా రాక; 1931లో పడాది శిక్ష పొందిన వారి నెల్లరను రెండేసి సంవత్సరముల కఠిన ఖైదు పాలు చేయుట, 1934 వరకు అందరు జైళ్లలో నుండడము తటస్థించెను. తరువాత రాజకీయ వ్యవహారములు పూర్తిగ దేశములోని యువకులను నిమగ్నులుగచేసి ఏ ఇతర కార్యమునకు తావొసంగక పోవుట సంభవించెను. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా నుండి ఆంధ్రదేశమును తక్కిన భాషాప్రాంతము లన్నిటితో బాటు సరిసమానమగు పదవియందుంచుటకు ఈయనపై కార్యభారము వేయబడెను. మొదటి శ్రేణివారు ఆంధ్రదేశపు నాయకత్వమును వహించి యుండి, అప్పటి కప్పుడె వార్థక్యమును పొందిన శ్రీ వెంకటప్పయ్యగారు, నాగేశ్వరరావుగారు, ప్రకాశం గారు మున్నగువారి స్థానములు నింపుటకు శ్రీ సీతారామశాస్త్రి గారు, శ్రీ కాళేశ్వరరావుగారు; సాంబమూర్తి గారు, నారాయణరాజు గారు, మున్నగు ఏ నలుగురైదుగురు మధ్య శ్రేణివారి స్థానము నింపుటకు వెంకటరావు, తిరుమలరావు, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గారు మున్నగు యువకులు పెద్దవారై దేశముయొక్క నాయకత్వమును వహించిరి. ఆంధ్రదేశములో అఖిలభారత నాయకులవంటి మహానాయకులు లేరని కొందరు అపోహగలిగియుండిరి. ఇది తప్పు. నిజమేమన, తక్కిన భాషాప్రయుక్త రాష్ట్రములవలే కొబ్బరి చెట్టు అంత ఎత్తుగల మొదటి నాయకులును, నేల మునగచెట్టు వంటి ద్వితీయ శ్రేణివారున్ను గల దేశము కాదు ఆంధ్రదేశము. ద్వితీయ శ్రేణికి చెందిన వారు కొంచెము యించుమించుగ మొదటి వారి దామాషాయిని అతిక్రమించినవారు



తుదిస్నానం అనంతరం




దహన క్రియలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యాశాఖా మంత్రి హాజరయారు.

కాని, వెనుకబడేవారు కారు. సాంబమూర్తి గారు, కాశీశ్వరరావుగారు మున్నగువారు ఎట్టి పదవుల కర్హులో తరువాత సరియైన కాలము వచ్చినపుడు అవగాహన అయి యుండెను. ఎప్పుడైతే వెంకట్రావుగారు రెవిన్యూ మంత్రిగ నిర్ణయింపబడిరో, అప్పుడు ఈయన సత్తాసామర్థ్యము వెల్లడి అయ్యెను. కాలేజీ మానివేసిన తరువాత యీయన దేశములోని ల్యాండు రెవిన్యూ పద్ధతులు ఎట్లుండెనో, రైతు ఆసామీల మధ్య ఉండే సంబంధ బాంధవ్యములు, జమీందారు, రైతు మధ్యను, జమీందారీ రైతు, ఆసామి మధ్యను ఉండే కౌలు ఖత్తులు, ఏర్పాట్లు ఇండియాలో ఏ రాజధానిలో ఎటులనుండెనో, పుస్తకములు, రిపోర్టులు సెక్రటరీ ఆఫ్ స్టేటు గారు వ్రాసి పంపిన డిశ్పాచీలు యివన్నియు క్షుణ్ణముగా చదివి, వాటినిగూర్చి నోట్సు వ్రాసుకుని-ప్రకాశంగారి రెవిన్యూ మంత్రిగానున్న కాలములో తయారుచేయబడ్డ 18 పర్వాలతోగూడిన యీ నూతన మహా భారతమును హృద్గతం చేసుకుని, ల్యాండు రెవిన్యూ అన్న ఇతిహాసముయొక్క గాథను అందలి ఉపాఖ్యానములను ఎప్పుడు అడుగుతే అప్పుడు పూర్వపక్ష సిద్ధాంతములతో ఎదటివారికి శృతపఱచి శాసన భయందు గావింపబడిన మార్పులకెల్ల తాను బాధ్యత వహించినవారైరి. అయితే మాత్రము వెంకట్రావుగారు వ్యవసాయము స్వయముగా చేసే రైతు వర్గమునకు ఎంత చిన్న ఆసామీ అయినాసరే-అతనికున్న భూమి ఒకప్పుడెప్పుడైనా, ఒక జమీందారీ అగ్రహారము, ఈనాం, భూములలో భాగమయినంత మాత్రమున, దానితరము జమీందారీ తరమని చెప్పి. ఆ నాలుగైదు ఎకరములు గలిగియున్న చిన్న రైతును-జమీందారీ వర్గమునకున్న లోట్లకు లోపములకు, లోబఱచుట ఎంతమాత్రము సమంజసముగ లేదని ప్రజాభిప్రాయమై యున్నది. చిన్న ఆసామికి భూమి సర్వ హక్కులతోను ఇయ్యవలెనంటే. సర్కారు భూమి, బంజరు, లక్షలకొలది

ఎకరాల వరుసగ నుండెను, అట్టి భూమి ఇచ్చినచో దేశమునకు మంచి గలిగేది. ఏ ఆసామి బాధపడే వాడు కాడు. ఇప్పుడన్ననో పడమర గోదావరి జిల్లాలో లెఖ్ఖలు క్రోడీకరించి చూడగా 5, 6 అగ్రహారములలో నుండే ఏ 4, 5 వేల ఎకరముల భూమియో, 400 — 1000 మధ్య సంఖ్యగల ఆసాముల చేతులలో నుండగా, వీరందరిని జమీందారీ కట్టు బాట్లకు లోబఱచి ఏ 2-3 సం.కో అమరక ఒఱచిన భూమి కౌలుకి పుచ్చుకొన్న ఆసామికి శాశ్వతముగా చెందవలెనని చెప్పుట, వేలకొలది కుటుంబాలను తల క్రిందులు చేసి యుండుటకు కారణ భూతమయ్యెను. ఇట్టి వారల లోకమే మంత్రిగారు భరించిన దుఃఖములకు కారణమయ్యెనని కష్టాల పాలు అయిన రైతాంగము అనుకొనుటకు హేతు వాదమునకు అనుకూలముగ నున్నట్లు గన్పట్టెను. అనేక మందికి చిన్న చిన్న ఈనాములు, వారిచే చేయబడునట్టు ఏర్పాటు అయిన సముదాయ సేవకు ప్రతిఫలముగ నుండి, అట్టి సేవ క్రమముగ జరుగుచున్నంతకాలము అట్టి ఈనాందారుల హక్కులను భంగపరుప వలసిన ఆవశ్యకము కనిపించలేదు. ఇట్టి సందర్భములలో మొదటి సారి రెవెన్యూ మంత్రిగా చేసిన కార్యముల టుండనిండు, రెండవ సారి రివెన్యూ మంత్రిగ ఈయన పరిపాలించిన కాలములో చిన్న రైతులకు అన్యాయము జరిగెనని అనేకులు తలంచుచుండిరి.

ఈయన మంత్రిగా నుండి, ఆ పదవికి రాజీనామా ఇచ్చి, జయపురం కాంగ్రెసు 1948 అక్టోబరు అనంతరము కాంగ్రెసు సెక్రటరీగా వెళ్ళడము, అప్పట్లో సాహస కార్యమని చెప్పదగును, 1940-41 లో గాంధి మహాత్ములు యుద్ధమును ప్రతిఘటించుటకు ఏర్పాటుచేసిన వ్యక్తి శాసనోల్లంఘనము జరిపిన కాలములో వ్యక్తి శాసనోల్లంఘనము జరుపుటకు అర్హత కాంగ్రెసు సభ్యులకు ఏయే రీతి ననుసరించి సంక్రమించునో ఆ సందర్భములు పూర్తిగా అవ



శ్మశాన వాటికలో స్వర్గీయ శ్రీ వెంకటరావుకి గౌరవ వందనం సమర్పించబడింది.



చివరి దృశ్యం

గాహన చేసుకుని, అప్పుడు ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెసు కమిటీకి సెక్రెటరీగా నున్న కారణమున, నాతో పాటు వెంకట్రావుగారిని కూడ వెంటనే ఖైదుకు వెళ్లకుండా గాంధిగారు ఆపుచేయుటవల్ల ఎప్పటికప్పుడు సత్యాగ్రహము చేయబూనిన కాంగ్రెసు సభ్యులయొక్క పూర్వవృత్తాంతము, నూలువడుకు శక్తి, అనుదినము వడుకు నూలుయొక్క లెఖ్ఖ మున్నగు వివరములు వారం, వారం, లేక పక్షం పక్షం వార్ధకు తీసుకొని వెళ్లి గాంధీగారి సంతకము సమ్మతి ఆయా పట్టీలమీద పొందియుండు క్రమ వరుసను జూచి గాంధీగారు స్వయముగా సత్యాగ్రహుల అర్హతను క్రోడీకరించుట వలన, వెంకట్రావుగారి శక్తి సామర్థ్యములను గూర్చి, చాలా శ్లాఘించుచుండిరి. ఆ ఉదంతమే. నేను జయపురం కాంగ్రెసు అధ్యక్షునిగ నున్న తరువాత వెంకట్రావుగారిని కాంగ్రెస్ కార్యదర్శిగా నిర్ణయించుటకు కారణమయ్యేను. తక్కిన వర్కింగు కమిటీ మెంబర్లు ఆయన ఈ పదవికి రావడము అంటే చాలా సంతోషించిరి. అయితే అప్పట్లో రివెన్యూ మంత్రిగ వెంకట్రావుగారుండుట వలన ఈ పదవికి రాజీనామా ఇచ్చి ఢిల్లీ వత్తురా అన్న సందేహము ఎవరికైనా గలిగినేమో కాని, నాకు గలుగలేదు. ఆయనను బాగా ఎరిగియున్న స్నేహితులకు గలుగలేదు. అప్పుడు ఈయనచేత ప్రొవిన్షియల్ పదవికి కూడా రాజీనామా ఇప్పించి, పార్లమెంటు మెంబరుగా చేస్తిమి, అందువల్ల ఢిల్లీలో జరుగు బాటుకు ఏమీలోటు లేకుండ నుండెను. ఒకవేళ ఈఢిల్లీ సభ్యత్వము ఈయనకు అప్పట్లో లభించలేదనుకోండి, ఢిల్లీ వెళ్లడమునకు సందేహింతురా? ఎంత మాత్రము సందేహించే స్వభావము గాదు వీరిది. ఉత్తర హిందూస్థానము నుండి సిక్కులు యాచకులుగ వచ్చుట మన మెరుగుదుము, వీళ్లల్లో కొందరు జ్యోతిషము చెప్పుతారు. ఒక పొట్టి సిక్కువయో వృద్ధుడు వీరిని పట్నంలో గలిసి కొద్దికాలములో నీవు వుత్తరమునకు వెళ్లుతావు. అక్కడ కొన్ని మాసములుండి తిరిగి దక్షిణమునకు వచ్చి వేస్తావని జ్యోతిషము చెప్పినాడు. ఆ ప్రకారమే జరిగింది. నా అధ్యక్ష కాలము అయిన తరువాత నాశిక్ కాంగ్రెసుకు కూడా నన్ను

అధ్యక్షునిగా పనిచేయమని, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్‌గారు అడిగిన మీదట నేను అంగీకరింపనైతిని, కాని వెంకట్రావుగారు కొంత కాలము సెక్రిటరీగా నుండసాగిరి. ఆ సంవత్సరము టాండను గారు పరాజితులగుట, కృపాలనీగారు గెలుచుట సంభవించెను. నాశిక్ తరువాత గూడ తిరిగి కృపాలనీ, టాండనుగార్ల మధ్య జరిగిన పోటీలో టాండను గారు గెలిచినపుడు వెంకట్రావుగారి సెక్రటరీ పదవి విషయమై కొంత గందరగోళము జరిగింది. కాని చివరకు ఎట్టి తొందరలు లేకయే కొంతకాలము మాత్రమే సెక్రటరీగ నుండిరి. తిరిగి జరిగిన ఎన్నికలలో టాండనుగారే గెలుచుట సంభవించెను గాని వెంకట్రావుగారికి సెక్రటరీ పదవి లభించలేదు. వెంకట్రావుగారంటే జవాహర్లాల్ గారికి అంత ఇష్టముగానున్నట్లు గన్పట్టలేదు. దీనికి కారణము పెద్దలుభయుల మధ్యను - అనగా టాండన్, జవాహర్‌లాల్ గార్ల మధ్యన - పుట్టి పెరిగిన వైమనస్యమే. కాని ప్రత్యక్షముగా జవాహర్‌లాల్ వెంకట్రావుగార్ల మధ్య ఏమీ ఉండియుండ లేదు. అప్పుడు వెంకట్రావు గారికి కొంత ఆశాభంగము గలిగియున్నట్లు స్నేహితుల యనుమానము. టాండనుగారు వెంకట్రావుగారి పక్షము. వెంకట్రావుగారు టాండన్ పక్షము. ఇట్టి బాంధవ్యము ఎట్లు శిథిలమయ్యెనో ఎవరున్ను చెప్పలేకుండిరి. పలువురు పలు విధముల ఊహించుచుండిరి కాని సత్యము - ఇదమిద్ధమని తేలలేదు. అంతటితో ఈయన తిరిగి మద్రాసు రావడము, మద్రాసు శాసన సభలో సభ్యులు కావడము, దానిని పురస్కరించుకుని హెల్తు మంత్రి కావడమూ, తరువాత అదివరకు జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు తిన్న దెబ్బ వెంకట్రావు, తిరుమలరావు, శ్రీమతి దుర్గాబాయమ్మ. వీరందరను ఓడించియుండ, పిమ్మట జరిగిన ఎన్నికలలో ఒక్క వెంకట్రావుగారే గెలుపొంది పిమ్మట సీతారామరెడ్డిగారి ఓటమిచే ఈయన తిరిగి రెవెన్యూ మంత్రి కావడం తటస్థించింది.

తాను ఓడిపోయినపుడు. ఓటమి ఎదుర్కొననున్నమాట వేంకటరావుగారికి తెలియును. పిమ్మట ఎన్నికలలో గెలుపు సంప్రాప్తమగునని ఘంటాపద



పూర్ణాహుతి

ముగ చెప్పుచుండెడి వారు. నక్షత్రముల, గ్రహముల సంచారమే ఈయనకు పరమ ప్రమాణము. జ్యోతిషము చదువుకొన్న కొద్దీ ఈయనకు విశ్వాసము పెరుగుచుండెను. పెరిగినకొద్దీ ఈయన శాస్త్రమును గాఢముగ పఠించుచుండెను. తిరిగి మంత్రి పదవి లభించినపుడు వెంటనే కాకపోయినా, దరిమిలాను, రెవిన్యూ శాఖకు అధ్యక్షులుగ వచ్చిరి. విలేజి ఆఫీసర్ల స్థితిని బాగుచేయుటకు సహాయపడ్డ వారిలో వీరు ముఖ్యులు. ప్రధాన మంత్రిగారికి ఈయన యెడల పరిపూర్ణ విశ్వాస మున్నప్పటికీ, కొన్ని అంతరంగ సంప్రదింపులకు ఈయనను ఆహ్వానించుట తగ్గించుచుండిరి. రాను రాను ఉభయుల మధ్య దూరము పెరుగుచుండెనా అనుపించుచూ వచ్చెను.

కాంగ్రెసు, దేశాభివృద్ధికై కోఆపరేటివు సిద్ధాంతములను అమలు పరచవలెననియు, వ్యవసాయము మొదలు - గృహములలో నిర్వర్తింపబడు చేతి పనులు - చిన్న చిన్న పరిశ్రమలు - ఈ సిద్ధాంతముల మీదనే వృద్ధి పొందింపబడ వలెననియు కాంగ్రెసు తీర్మానించిన పిమ్మట వెంకట్రావుగారికి ఈ శాఖ వప్పగించడము దేశమునకు ఎక్కువ లాభకరముగ నుండేది అని చెప్పుటకు సందియము లేదు. కాని రెవిన్యూ మంత్రి పదవిని వీరు స్వీకరించుట వలన, అట్టి పునర్నిర్మాణమునకు అవకాశము చిక్కలేదు. ఈయనకు అభిమాన శాఖ కోఆపరేటివ్ శాఖయే. రెవిన్యూ అభిమాన శాఖగా ఈయన వశము చేయబడలేదు. వెనుక చదువు చెప్పిన పాఠము అగుటవలన, ఆశాఖయే వీరికి వప్పగింత చేయబడెను. మొత్తముమీద ఒక శాఖ పరిపాలింప గలిగి - ఇంకొక శాఖ పరిపాలింపలేక పోలేదు - ఆరోగ్య శాఖ ఎప్పుడైతే వప్పగింపబడ్డదో, దానిని గూర్చి చేయవలసిన కార్యములను క్రమ వరుసను జరిపి - డాక్టర్ల సంఖ్య - ఆస్పత్రుల ఏర్పాటు. క్షయ వ్యాధిని ఎదుర్కొనుట, చలి జ్వరమును సంహరించుట, ఇవ్విధముగ, దేశము యొక్క ఆరోగ్య స్థితి పెంపొందింపబడు చుండెను - మరణ సంఖ్య తగ్గింప బడుచు, జనన సంఖ్య క్షయము గాకుండ చూచుటవలన జనాభా పెరుగుటకు కారణము లేర్పడెను. కాని కళావారి ఇంట సుపుత్రుడు జనింపకుండెను.

ఎన్నికలలో పోటీలు జననాంతర సౌహార్దయమును భంగము చేయును అని... వీనినిగూర్చి శ్రద్ధగ చూచువారు ఎరుగుదురు. కారణము ఏక ఫలాపేక్ష. 1899 లో - కాకినాడలో నుండే శ్రీ గంజాం వెంకటరత్నం గారు, శ్రీ కృత్తివెంటి పేర్రాజు గారు - బాల్య స్నేహితులు - మద్రాసు శాసన సభలో స్థానము కొఱకు పోరాడి - విరోధులయిరి. ఈ విధముగనే ఎక్కడ చూచినా, కర్ణార్జునులు గన్పింతురు.

వెంకట్రావు గారు ఆంగ్లభాషపై పరిపూర్ణ స్వాధీనతను సంపాదించిరి. ఆయన, నేను దక్షిణాది సంచారము చేయుట తటస్థించింది. 1937 ప్రాంతంలో శ్రీ సి. రా. ఆచార్లు గారు ప్రధానిగా నున్న కాలములో - కో-ఆపరేషన్ ఉద్యమమును గూర్చి ఒక రాజధాని సభ వీరిచే ఏర్పరుపబడెను అందులో వెంకట్రావుగారు సభ్యులు. నేనున్నూ సభ్యుడను. వెంకట్రావుగారిచే కోనసీమ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకు అను పేరట అమలాపురంలో స్థాపింపబడిన బ్యాంకుయొక్క అఖండ అభివృద్ధియే దీనికి కారణము. అప్పటికే ఈయన ఈ శాఖ విషయమై ఎక్కువ పాండిత్యమును సంపాదించు కొనిరి. ఆ బ్యాంకును ఎంతయో వృద్ధిపఱచిరి. మంచి భవనమును నిర్మించిరి. భవనమునకు తగిన పుస్తకాలయమును స్థాపించిరి. స్వయముగ పుస్తకములను ఏరి కొనుచు, దానిని ప్రథమములో తానుపూర్తిగ చదివి- దానిపై ఆ మూలాగ్రముగ నోట్సు వ్రాసుకుని ఆ పుస్తకమును అప్పుడు లైబ్రరీకి పంపుచుండెడివారు. ఈ విధముగ రాచకీయము, ఆర్థిక శాస్త్రము, సొమ్ము - నాణెములు, పన్నులు - సహకార పద్ధతిపై గృహపరిశ్రమలు - జాతీయ విద్య, మున్నగు విషయములను గూర్చి - సాంగోపాంగముగ గ్రంథపఠన చేయుటకుగాను అవశ్యకమగు గ్రంథములను సేకరించుచు - జిల్లా ప్రధాన పట్టణమునందుకంటె- రాజధాని (ప్రధానపట్టణమున) కనుగుణ్యమగు ప్రదేశమునందుండదగిన పుస్తకాలయమును స్థాపింప

గలిగిరి. ఈయన లేనికాలములో ప్రచురింపబడిన పుస్తకములు లోటుపడకుండ, ఇటీవల తిరిగి శ్రద్ధతో పుస్తక సేకరణ జరిపి, గ్రంథాలయమును వెనుకబడియుండకుండ, ఆధునిక ప్రచురణములతో నింపివైచిరి.

అమలాపురంయొక్క విద్యాభివృద్ధికేమి, సామాజికాభివృద్ధికేమి ప్రధాన కారకులు శ్రీ వెంకటరావుగారే. తిరిగి పూర్వపు అభిమాన విద్యలు, కార్యములు, సంస్థలు – వీని నన్నింటిని తన దృష్టిలోనికి, తన శ్రద్ధ క్రిందికి, తన ఆదరణలోనికి తీసుకొన గలిగిన సావధానమును గలిగి తూర్పు గోదావరి జిల్లాను ఆంధ్ర ప్రదేశమునకు మార్గదర్శస్థానము గల దానిగ చేయగలిగిన స్థితికి తీసుకురాగలిగినారని సంతోషించుచుండగా ఈ ఆపత్తు సంభవించెనుగదా !

1951 సంవత్సరంలో – నా అహ్వానమును అంగీకరించి మధ్య ప్రదేశములోని ఆరోగ్య స్థానమైన పచ్‌మరి కొండలలో రెండు మాసములన్నా ఉండుటకు నాగపూరు కయితే వచ్చియుండిరి కాని అది సరియైన నక్షత్రమందు జరిగినట్లు కన్పింపలేదు. నాగపూరు వచ్చిన రెండు మూడు రోజులకే పచ్‌మరీకి బయలుదేరి కారులో వెళ్లాను. వెళ్లినవెంటనే తలలో ముచ్చిలిగుంట అంటామే ఆ ప్రదేశము మొదలు వీపుమీద క్రిందకు జానెడు ప్రాంతము మంటలు – సెగలు పొగలు బాధ ఎక్కువగా ఉండెనని చెప్పగా – జ్వరము 103 ఉండెను. నాలుక ఎండిపోవడము, అతి దాహము – నిద్ర లేకపోవడము. అక్కడ మరి వారమునకు తక్కువగా ఉంటిమి. రోజురోజు ఎక్కువ అవుతూంటే – నాగపూరులో ఆస్పత్రిలో గది పుచ్చుకొని – వెంటనే బయలుదేరి నాగపూరు మేమందరము వచ్చివేస్తిమి. ఆరావడం సరాసరి ఆస్పత్రిలోనే ప్రవేశపెట్టితిమి. ఆ ఉనికి 79 రోజులు అట్లుండిరి వీపుమీద సగము వీపును వ్యాపించిన మహారణమయ్యెను. ఇదంతయు పారతో గడ్డిచెత్త చెక్కినట్లు – ఒక పెద్ద చెక్కను తెగ్గోసిరి. కాని ఏ ఘడియయందు శస్త్రము జరిగెనో, ఆ నిమిషము మొదలు ఎట్టి వ్యతిరేకము జరుగకుండా – సరాసరి మానుటబట్టి 79 రోజులకు రోగిని ఆస్పత్రినుండి విడుదల చేయవచ్చునన్న స్థితిలోనికి దెచ్చిరి. కుటుంబము యావత్తు పచ్‌మారి వచ్చిరి. ఇంక వచ్చేపోయే మిత్రులు–శ్రేయోభిలాషులు–లెక్కలేకుండ నుండిరి. వెంటనే బయలుదేరి నాగపూరు చేరితిమి. ఆపైన ఇంటికి వెళ్లిరి. కుటుంబమునకు, స్నేహవర్గముకు–నాకు–అత్యంత సంతృప్తికలిగినదనుటలో అతిశయోక్తిలేదు.

కాని అతిమూత్రము నమ్మదగినవ్యాధికాదు. మొదటిదెబ్బ తప్పించుకోవచ్చు. రెండవది దాటవచ్చును. మూడవ గండము ప్రాణఘాతకము అని చెప్పవచ్చును. ఈ సంగతి వెంకట్రావు గారెరుగుదురు. ఒక ప్రక్కన జ్యోతిషము, మరియొకవైపు లోకానుభవము. వాటితోపాటు నాచెడ్డనోరు. ఇవన్నీ కలిసి యీసారి ఈయన తప్పించుకోవడము దుస్సాధ్యము అని స్థిరపఱచితిమి నేను హైదరాబాద్ విడిచి వెళ్లేటప్పుడు విస్పష్టముగ, ఈసారి ఏదైన జబ్బుచేసినచో ఆపత్తు తప్పదుసుమా అని నా అశుభమాట చెప్పి వెళ్లితిని. నేను తిరిగి వచ్చేసరికి మనవాడు మనలను విడిచిపోయెనని నేను మద్రాసు వచ్చిన తరువాత మాటలలో మా అబ్బాయి చెప్పేవరకు నాకు తెలియదు. కుటుంబమును చూతామంటే వారు అమలాపురం వెళ్లిపోయినారు. ఇంక మనకు ఎట్టి స్మరణ ప్రాప్తి లేకపోయినదే అని చింతించుచుండగా – డైరెక్టరుగారినుండి, ఈ ఉత్తరం వచ్చినది. ఇంక ఈ ప్రయత్నములో ఈ నాలుగు రోజులు గడిపి – ఈ నాలుగు ముక్కలు వ్రాసి, లోపలి దుఃఖము కొంతవఱకు శమింప జేసికొన గలిగాను.

శ్రీ॥ శే॥ శ్రీ కళా వెంకటరావు

శ్రీ పి. రంగారెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు.

శ్రీ కళా వెంకటరావుగారు కాలధర్మంచెంది అప్పుడే దాదాపు మూడు నెలలు కావస్తూవున్నా ఆయన ఈనాడు మనతో లేరే అని అనుకోవడం కష్టంగావుంది. భారత స్వాతంత్ర్య సమరంలో ఆయన యోధాగ్రేసరులు. 1900 సంవత్సరంలో ఆయన జన్మించారు. విజయనగరం, బందరు పట్టణాలలో విద్యాభ్యాసం చేశారు. బి. ఏ పూర్తికాక మునుపే 1921లో మహాత్మా గాంధీ పిలుపు నందుకొని జాతీయోద్యమంలోకి దుమికారు. ఆనాటి నుండి కాంగ్రెసు మహాసంస్థ నడిపిన ప్రతి ఉద్యమంలోనూ ఆయన అగ్రగామియై నిలచి ఎనిమిది పర్యాయాలు కారాగారవాసశిక్ష అనుభవించారు. ఇందులో రెండు మార్లు కామాలి డిటెన్షన్‌లో ఉంచబడ్డారు. భారతజాతి విమోచనం కోసం ఆయన అలా త్యాగాలు చేశారు కాబట్టే ఈనాడు మనం ఆయన్ని స్మరించుకొని గౌరవిస్తున్నాము ఆయన్ని మనం ఇంతగా గౌరవించడానికి మరొక కారణం కూడా వుంది. జాతీయ కాంగ్రెసు సంస్థలో వాలంటీరుగా చేరినప్పటినుంచీ ఆయన నూటికి నూరుపాళ్లు కాంగ్రెసు వాదిగా, క్రమ శిక్షణగల ప్రజా సేవకుడుగా వినుతికెక్కారు. ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి తరువాత శ్రీ కళా వెంకటరావుగారు తమ అవసానదశ వరకూ కాంగ్రెసును అంటిపెట్టుకొని వుండి, నలభై యేళ్ళ రాజకీయ ప్రజాహిత జీవితంలో భారతజాతి అనుభవించిన కష్టసుఖాలను కళ్ళారా చూచారు. జాతీయ కాంగ్రెసు మహాసభతో ఆయనకు గల సంబంధము, ఆయన స్థిర బుద్ధి, తెలివితేటలు, ప్రతిభా సంపదలు, వివేకము, తమదాకా వచ్చిన విషయాలను గూర్చి వివేచనతో ఆయన వెలిబుచ్చే అభిప్రాయాలు, అందరికీ సంతృప్తికరంగా సమస్యలను ఇట్టే పరిష్కరించడం- ఇలాంటి గుణవిశేషాలన్నీ ఆయనకు ఆంధ్ర "ద్రోణాచార్యుడు" అన్న పేరును తెచ్చాయి. ఆ పేరు నిజంగా ఆయనకు సార్థకమైంది.

శ్రీ కళా వెంకటరావుగారికి ప్రజలతో గల సాన్నిహిత్యం, పరిచయం ప్రత్యేకంగా పేర్కొనదగ్గవి. చనిపోయే వరకు గూడా ఆయనకు ఆంధ్రలోని ప్రతి చిన్న కాంగ్రెసు కార్యకర్త తెలుసు. ప్రతి గ్రామం ఆయనకు తెలుసు. దీనినిబట్టి ఆయన ఎంతటి విశాల హృదయంగల మనిషో విదితమవుతుంది కనుకనే ఎట్టి బాధ్యతనైనా ఆయన నిర్వహించ గలిగేవారు. కష్టించి పనిచేసి తమ కప్పగించబడిన బాధ్యతలను నిర్వహించడం ఆయన విశిష్టత.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి అంకితమైన జీవితం శ్రీ కళా వెంకటరావుగారిది. చివరకు కర్తవ్యం నిర్వహిస్తూనే ఆయన మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో త్వరిత గతిని అభివృద్ధి చెందుతూవున్న ముఖ్య ఘట్టంలో ఆయన మరణించడం చాలా దురదృష్టకరమైన విషయం. ఇట్టి దుస్సంఘటనను విస్మరించలేము. ఆయన తమ సహచరులకే గాక, తమకు పరిచయమైన వారందరికీ కూడా మిత్రులే కనుకనే వ్యక్తిగా ఆయన అంతస్తు గొప్పది పార్లమెంటేరియనుగా శ్రీ కళా వెంకటరావుగారి ప్రతిభా సంపదలు అందరూ ఎరిగినవే. అయన మంచి వక్త. తమ ప్రతికక్షీను కూడా తన వాదంతో ఆకట్టుకోగల ప్రతిభాశాలి. భూసంస్కరణల విషయంలో ఆయనకు తెలియనిది లేదు ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల బిల్లును రూపొందించడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. ఆ బిల్లుకు తుది మెరుగులుదిద్ది ఆ తరువాత రాజకీయ జీవితంనుంచి విరమించు

కోవాలని ఆయన అనుకున్నారు. కాని అది జరుగ కుండానే విధి వారిని మనలనుండి దూరంచేసింది.

శ్రీ కళా వెంకటరావుగారు పరిపాలనా దక్షులే గాక సచ్ఛీలురు, మేధా సంపన్నులు కూడా. కేవలం కృషి, దీక్ష క్రమశిక్షణ వల్లనే ఆయన వాలంటీరు నుండి మంత్రి పదవికి రాగలిగారు. 1949-50 సంవత్సరాలలో భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా కూడా వారు అత్యంత సమర్థతో పని చేశారు. 1946 లో మద్రాసు శాసన సభకు ఎన్నికై 1947 నుంచి 1949 వరకు రెవిన్యూ మంత్రిగా పనిచేశారు. ఆనాటి వారి రెవిన్యూ మంత్రి పదవి దేశంలోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంది. ఆయన రెవిన్యూ మంత్రిగా వున్నప్పుడే ఎంతో వివాదాస్పదమైన మద్రాసు జమీందారీల రద్దు బిల్లును శాసన సభలో ప్రవేశపెట్టి దక్షతతో దానిని ఆమోదింప జేశారు. 1950-51 సంవత్సరాలలో రాజ్యాంగ పరిషత్తు సభ్యులుగా వున్నారు. 1951 సెప్టెంబరు మొదలు 1952 ఫిబ్రవరి వరకు అవిభక్త మద్రాసు రాష్ట్ర ఆరోగ్యశాఖా మంత్రిగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి ఉపాధ్యక్షులుగా కూడా వుండి, 'నీరా' విషయంలో ప్రభుత్వం చేసిన నిర్ణయంతో ఏకీభవించజాలక 1954 మార్చిలో ఆ పదవికి రాజీనామా ఇచ్చారు. 1955 మార్చిలో కొత్తపేట నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ ఓట్లతో ఆంధ్ర శాసనసభకు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచీ శ్రీ కళా వెంకటరావుగారు సంజీవరెడ్డి మంత్రివర్గానికి బలీయమైన అండగా వున్నారు. వివిధ దేశాలలో భూమి అమరిక విధానాలను ఎంతో వివరంగా పరిశీలన చేశారు. చైనాలో సహకారోద్యమ విధానాన్నికూడా సమగ్రంగా తెలుసుకోవడానికి ఉద్యుక్తులయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో సహకార వ్యవసాయ విధానం జయప్రదం చేయవలెనని వారి నిశ్చయం. ఇట్టి ప్రతిభాశాలిని కోల్పోవడం మన దురదృష్టంగాక మరేమిటి? జన్మతః ఆయన నాయకుడు. అందులోనూ ఉత్సాహం, చొరవగల నాయకుడు. ఆయన స్వయంసిద్ధుడు కనుకనే పేరు ప్రఖ్యాతులు, గౌరవాదరాలు ఆయన్ని వెదుక్కుంటూ వొచ్చేవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థను సుస్థిరం చేయడానికై ఆయన చేసిన కృషి చరిత్రకెక్కవలసినది. భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం ఆయన చిరకాలవాంఛ. భారతదేశం స్వతంత్రం కాకమునుపే భాషాప్రయుక్త రాష్ట్రాలేర్పడవలెనని వాదించిన మనిషి. ఈనాడు మన మధ్య ఆయన భౌతికంగా లేకపోవచ్చు. కాని ఆయన పేరు తలచుకొన్నంత మాత్రంచేతనే ముందుతరాల ఆంధ్రులు ఉత్తేజితులై ప్రజాసేవకు, దేశసేవకు ఆయన చూపెట్టిపోయిన మార్గాన్ని అనుసరిస్తారని నా ప్రగాఢ విశ్వాసం.

అసమాన శేముషీదురంధరుడు

శ్రీ మొసలికంటి తిరుమలరావు (పార్లమెంటు సభ్యులు)

కీ॥ శే॥ శ్రీ కళా వెంకటరావుగారితో నాకుగల సాహచర్యం దాదాపు నాలుగు దశాబ్దాలనాటిది. కనుకనే ఆ మహావ్యక్తినిగూర్చి కేవలం విషయ ప్రధానంగా నేనేమైనా చెప్పడం కష్టమే. ఆ వ్యక్తి గొప్పదనం అటువంటిది.

మేమిద్దరమూ సమవయస్కులం. అంతేగాక ఈ నాలుగు దశాబ్దాల ప్రజాహిత జీవితంలో మేము ఎంతగా కలసిమెలసిపోయ్యామంటే—ఆయన కాల ధర్మం చెందిన తరువాత నా శరీరంలోనుంచి ఏదో భాగం అదృశ్యమైపోయినట్లుగా అనిపిస్తూవుంది.

వెంకటరావు 1921 లో కాలేజీ వదిలిన లగాయతు జీవితాంతంవరకూ ప్రజా సమస్యల విద్యార్థిగానే వున్నారు. ఆయన బుద్ధి ఒక క్రమపద్ధతిగలది. ఆయనముందెప్పుడూ ఒక లక్ష్యంవుండేది. జీవితంలో ఆయన నియమబద్ధమైన మనిషి. ఒక ప్రణాళిక ప్రకారం సాగిపోయ్యేవాడు. మొదట స్థానిక సంస్థలలోనూ, సహకార సంస్థలలోనూ తగు తర్ఫీదు పొంది, ఆ ప్రాతిపదికతో తరువాతి జీవితంలో వహించిన పదవీ బాధ్యతలను ఆయన ఎంతో తెలివితేటలతో నిర్వర్తించారు. చాలా చిన్నవయస్సులోనే తాలూకా జిల్లా బోర్డుల సభ్యత్వంపొంది, శక్తిసామర్థ్యతలతో, సమర్థతతో అమలాపురం కో ఆపరేటివ్ బ్యాంకు వ్యవహారాలను నిర్వహించారు.

ఇక కాంగ్రెసు వ్యవస్థ విషయంలో ఆయన తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శిత్వం మొదలుకొని భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శివరకు పదవులు నిర్వహించారు. కాంగ్రెసు సంస్థనుగూర్చి ఆయనకు తెలియని విషయ మంటూలేదు వ్యక్తిగాకూడా ఆయన సంస్థాగత వ్యవహారాలపై వేసిన ప్రభావం చెరగిపోనిది. ఈనాడు మనకు అటువంటి వైయక్తిక ప్రభావం చాలా అరుదుగా కన్పిస్తుంది.

జైలుకేళ్ళే ప్రతి ఉద్యమంలోనూ ఆయన పట్టుదలతో పాల్గొన్నారు వ్యక్తి సత్యాగ్రహోద్యమాన్ని, క్విట్టిండియా ఉద్యమాన్ని బహు చాకచక్యంతో నడిపి పోలీసులు ఆశ్చర్యపోయేట్టు చేశారు ఆయన వ్రాసిన ఆంధ్రా సర్క్యులరు దేశమంతటికీ పాకి, పెద్ద దుమారం లేపి ప్రభుత్వ రికార్డులకు కూడా ఎక్కింది. సత్యాగ్రహోద్యమంలో ఆ సర్క్యులరుకు వచ్చిన ప్రచారం మరిదేనికి రాలేదేమో!

మంత్రిగా ఆయన ప్రతి విషయాన్ని సాకల్యంగా తెలుసుకొని నిర్ణయాలు చేసేవారు. పరిపాలకుడుగా అధికార యంత్రాంగాన్ని ఒక క్రమశిక్షణలో పెట్టి వారిపట్ల సానుభూతితో వ్యవహరించేవారు. ప్రభుత్వోద్యోగులవల్ల దేశానికి ఎటువంటి సేవలు పొందవచ్చో ఆయనకు బాగా తెలుసు. అవి సాధించడంలో ఆయన కృతకృత్యులయ్యారు జమీందారీల రద్దు శాసనాన్ని అమలులోకి తెచ్చింది వెంకటరావే అవిభక్త మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా వున్నప్పుడు బలీయమైన కొన్ని వర్గాలు ఆయన్ని ఎదిరించాయి. జమీందార్లు తాము తేగల మహా మహా న్యాయశాస్త్ర విశారదులందర్నీ తెచ్చి బిల్లును ఎదుర్కొన్నారు. కాని వారి నందరినీ ఎదురొడ్డి నిలిచి స్థిరసంకల్పంతో, ప్రజ్ఞాప్రాభవాలతో తన శాసనం ద్వారా జమీందారీలను ఒక్కదెబ్బతో నిర్మూలించాడు. ప్రతి మంత్రివర్గంలోనూ అనివార్యంగా వుండవలసిన మనిషి. ముఖ్యంగా నేటి ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గానికి ఆయన వెన్నెముకవంటివాడు. ఎంతో సులభంగా ముఖ్యమంత్రి అవవలసిన యోగ్యతలెన్నో ఆయనకున్నవి అయినట్లుంటే తన

ప్రాభావ ముద్రను వేసి మరీ పొయ్యేవాడు. ఆయన ఏ పదవిలో వున్నా కార్యదీక్ష, కార్య నిర్వహణా దురంధరతతో తరువాతివారికి మార్గదర్శకుడవుతూ వుండేవాడు ఆయనేగనుక కేంద్ర శాసనసభకు వచ్చినట్లుంటే కేంద్రంలో విశిష్టవ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించి వుండేవాడు. ఇంకా వృద్ధాప్యంపైబడకమునుపే దైవం ఆయన్ని మన నుంచి వేరుచేసి నిజమైన ఒక ప్రజాసేవకుణ్ణి తీసుకెళ్ళి, తద్వారా ఆయనవల్ల పొందవలసిన మేళ్ళన్ని పొందకుండా చేశాడు.

ఎన్నోవిధాల నేను ఆయనకు చాలా సన్నిహితుణ్ణి. అందుచేత ఈ సందర్భంలో నా వ్యక్తిగత భావాలను వెలిబుచ్చడం సమంజసం కాదనుకుంటాను. అందరివలెనే నేనుకూడా ఒక విశ్వాసపాత్రుడైన, మార్గదర్శకుడైన మిత్రుణ్ణి కోల్పోయినందుకు దుఃఖిస్తున్నాను.

వెంకటరావు ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చుగాక !

అద్వితీయుడైన వ్యక్తి

శ్రీ బి. యస్. మూర్తి,
(భారత ప్రభుత్వ సామాజికాభివృద్ధి, సహకార శాఖల డిప్యూటీ మంత్రి)

కీ॥ శే॥ శ్రీ కళా వెంకటరావుగారు అద్వితీయుడైన వ్యక్తి. ఆయన సాధారణ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయితే అంతర్గతమైవున్న ఆయనలోని ఉత్సాహాన్ని, తెలివితేటలను పేదరికం కప్పివేయలేక పోయింది. ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ ఆయన ప్రజాహిత జీవన రంగంలోకి ప్రవేశించారు. బాల్యంలోనే నలుగురికీ పరిచయమయ్యారు. విద్యార్థి దశ నుంచే ఆయనలో నాయకత్వ లక్షణాలున్నాయని చెప్పడానికి కాలేజీని బహిష్కరించి స్వాతంత్ర్యోద్యమంలోకి ఆయనదుముకడమే ప్రబల తార్కాణం. కాలేజీ చదువు వదిలిపెట్టి, స్నేహితులందరినీ కూడగట్టుకొని బాపూజీ నాయకత్వం క్రింద పూర్ణ స్వరాజ్య పథం వైపు ఆయన ముందంజ వేశారు. పార్టీ అంటే ఆయనకు గల అభిమానమూ, పట్టుదల, దీక్ష అద్వితీయమైనవి ఏ పోటీలోనైనా తనపార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన నిశ్చయించుకున్నాడంటే ఏదీ ఆయన్ను ఆపలేక పొయ్యేది. అమలాపురంలో కోనసీమ సెంట్రల్ కో-ఆపరేటివు బ్యాంకు కార్యదర్శిగావున్నా, భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగావున్నా, రాష్ట్ర ప్రభుత్వ మంత్రిగావున్నా—ఏ పదవిలోవున్నా సరే, స్వాతంత్ర్యపోరాటానికి బాధ్యత వహించి, దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిన తనపార్టీ అన్ని తరగతుల ప్రజానీకాన్ని సమీకరించి, దినదిన ప్రవర్ధమానమై సిరి సంపదలతో, భోగ భాగ్యాలతో విరాజిల్లే ఒక నవశకాన్ని ఈ దేశంలోకి తేవాలి అని గాఢంగా అభిలషించే స్థిర సంకల్పుడాయన.

తాను పుట్టింది మడీ ఆచారాలూ గల సనాతన కుటుంబంలోనైనప్పటికీ, ఆయన కులభేదాలను ధిక్కరించి దళితులైన హరిజనులకూ, గిరిజనులకూ బాసటగా నిల్చేవారు ఆయన మనస్సు నవనీతము వంటిది కష్టాలలో వున్న వారిని ఎంతో కారుణ్యంతో ఆదుకునే వారు. మళ్ళీ అంతటి దయామయుడు పార్టీ విషయం వచ్చేప్పటికి, రాజకీయ ప్రతికక్షుల సమస్య వచ్చేప్పటికి నిర్దాక్షిణ్యంగా నిర్ణయాలు చేసేవారు జ్యోతి శ్శాస్త్రం అంటే ఆయనకు అపరిమిత అభిమానం కాని తారాబలం వొచ్చేదాక ఏపనీ ఆపేవారు కాదు. నిర్ణయం చేసేసి, ఫలకాలన్నీ పూర్తి చేసుకున్నారంటే ఈ భూప్రపంచం మీద ఆయన్ని ఎవరూ ఆపలేక పొయ్యేవారు. వెంటనే కార్యరంగంలోకి దూకి తన ప్రతికక్షులను చిత్తుజేసి తన పార్టీ మళ్ళీ అధికారంలోకి రావలసిందే, రాజకీయాలలో అంతటి అసహాయోద్యమ నాయకుడూ, సహకార రంగంలో మళ్ళీ ఆయనవంటి కార్యకర్త అరుదు. కోనసీమ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంకును ఆరంభంనుంచీ వ్యవస్థీకరించి దానిని సక్రమంగా నిర్మాణం చేశారు ఏ విషయాన్నీ ఆయన అల్పంగా భావించేవారు కాదు. ప్రతి పనినీ ఒక పద్ధతి ప్రకారం చేసేవాడు. అన్నీ సవిమర్శకంగా ఆలోచించేవాడు. ఏ పని అయినా మొదలు పెట్టాడంటే దాన్ని తుద ముట్టించవలసిందే. ధర్మబద్ధమైన ప్రతి ఉద్యమాన్నీ ఉత్తేజపరిచేవాడు. ఆయన చేపట్టిన ప్రతిదీ సమగ్రంగా భాసించవలసిందే. విజ్ఞుడు. ప్రతిభా సంపన్నుడు. ఆయన గ్రంథ పరిశీలనము ఆదర్శప్రాయమైనది. జాన్సన్ మాదిరిగా అనేక విషయాలకు సంబంధించిన పుస్తకాలు చదివి, నోట్సు వ్రాసుకొనేవాడు అమలాపురం బ్యాంకులోని ఆయనగది నిండా అవే!

రాజకీయాలు ఆయనకు ప్రధాన విషయం. ఆయన కిష్టమైన విషయం కూడా అదే, తనకోసం కాదు, దేశంకోసం; అదికూడా కాంగ్రెసు అధ్వర్యం క్రింద కాంగ్రెసు సంస్థ అంటే ఆయన గర్వించే వారు ఈ జాతీయ మహాసంస్థను దేశంలో ఇంకా బలీయం చేయడానికి ఆయన సర్వదా శక్తివంచన లేకుండా పాటుపడేవాడు కాంగ్రెసు ఎప్పటికీ చెడు పని చేయదని ఆయన నమ్మిక.

వ్యక్తి గతంగా ఆయన స్నేహపాత్రుడు. ప్రేమా దరాలు గల మనిషి. ఆయనకు మనం ఎంత సమీపంగా పోతే అంత సరసంగా, అంత నిరాండంబరంగా వ్యవహరించేవాడు తన సరసోక్తులతో, విషయ పరిజ్ఞానంతో చుట్టూ కూర్చున్న వారిని రంజింప జేసేవాడు. ఒక్కొక్కమారు కడుపుబ్బ నవ్వించే వాడు ఆయన బుద్ధి పాదరసంలా పనిచేసేది. పరిష్కారం లేని సమస్యంటూ ఆయనకు లేదు రాజకీయ రంగంలో ఇంద్ర జాలాలు చేసిన మహా మాంత్రికుడు, అటువంటప్పుడు ఆయన మిత్రులు పడే సంబరమూ, ప్రతి కక్షులు పొందే భంగపాటూ చెప్పనలవి కాదు. రాజకీయ ప్రతి కక్షులు తప్ప వ్యక్తిగత శత్రువు లెవరూ ఆయనకులేరు. తన జీవితాన్ని అంకితం జేసినట్టి పార్టీని ఎదిరించి నందుకు గాను వారు పశ్చాత్తాపం ప్రకటించేదాకా నొదితే వారుకారు. నూటికి నూరుపాళ్ళు దేశభక్తుడు. డబ్బంటే లోభంలేని మనిషి. విశిష్ట వ్యక్తిత్వంగల రాజనీతివేత్త. ఆయకుగల బహు విషయ పరిజ్ఞానం వల్ల, అపారమైన అనుభవంవల్ల, పరిపాలనా దక్షతవల్ల మద్రాసు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలూ, దేశమూ ఎంతో మేలుపొందాయి అఖిలభారత కాంగ్రెసుకు సర్దార్ పటేలు ఎటువంటి వాడో, ఆంధ్ర కాంగ్రెసుకు శ్రీ కళావెంకటరావు అటువంటి వారు

ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక !

జూన్, 1959

స్వచ్ఛమైన ప్రజాహిత జీవి

డాక్టర్ యం. రంగయ్య, యం. యల్. ఏ.

విశుద్ధమైన స్వభావం, తిరుగులేని నిర్ణయం, నిర్భయమైన నడవడి—ఈ గుణవిశేషాలవల్ల కీ॥ శే॥ శ్రీ కళా వెంకటరావు ఆంధ్రదేశమంతటా సుప్రసిద్ధులయ్యారు.

వెంకటరావుగారు సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన మొదట కాంగ్రెసువాది. తరువాతనే మరేమైనా. కాంగ్రెసుపట్ల ఆయనకుగల విశ్వాసం అంత అచంచలమైనది. కులమత విభేదాలు ఆయనకు సరిపడవు.

బాల్యంనుంచీ ఆయన నిరాడంబరజీవితం గడిపారు. ఆయన వ్యక్తిగత జీవితం నిష్కళంకమైంది. ఎట్టి లోభాలకూ ఆయన లోబడలేదు.

ఆంధ్ర రాజకీయాలలో ఆయన ప్రముఖవ్యక్తి. ప్రచారమూ, ప్రశస్తీ ఆయన వాంఛించేవాడుకాదు. కేవలం తెలివితేటలమీదనే ఆధారపడి, కష్టించి పనిచేసి కాంగ్రెసు లక్ష్యమైన భారత స్వాతంత్ర్యానికి అవిరళకృషి చేశారు. అగస్టు ఉద్యమంలో జారీ చేయబడిన "ఆంధ్రా సర్క్యులరు" ఆయన ధైర్య సాహసాలకూ, చొరవకూ నిదర్శనం. దేశభక్తి అన్వేషణలో ఆయన "రాజకీయ బాధితులకు భూములు" అన్న ప్రతిపాదనను కనిపెట్టారు.

ఎస్టేట్ల రద్దుచట్టానికీ, ఇనాముల రద్దుచట్టానికీ ఆయన పితామహుడు. ఆచరణ సాధ్యమైన భూసంస్కరణలను ప్రవేశపెట్టవలెనని ఆయన ఆకాంక్ష.

గంభీరమైన ఆలోచన, పరిపక్వమైన వివేకము, నిండైన అనుభవము, వాస్తవిక దృష్టి, ఆచరణసాధ్యమైన ఆదర్శము—ఇవి శ్రీ కళా వెంకటరావుగారి గుణాలు.

ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక !



అనుభవజ్ఞుడైన రాజనీతివేత్త

ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకటరావుగారి మృతితో ఆంధ్ర రాజకీయ రంగం నుంచి అనుభవజ్ఞుడైన రాజకీయ వేత్త ఒకరు నిష్క్రమించారు. 1953 లో ఆంధ్రరాష్ట్రం అవతరించినప్పటినుంచి శైశవావస్థలో వున్న ఈ రాష్ట్రాన్ని ఆయన సర్వ విధాలా చక్కదిద్దుతూ వొచ్చారు. ఇప్పుడాయన మూడుకోట్ల ఆంధ్రుల చిరకాలవాంచితమైన ఆంధ్రరాష్ట్ర సిద్ధికి అహర్నిశమూ కృషి చేసినట్టి శ్రీ కొండా వెంకటప్పయ్య, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారివంటి మహామహుల కోవలో కలిసి పొయ్యారు.

ఆంధ్రదేశంలో మొదట మొదట కాంగ్రెసు సంస్థను నిర్మించిన వారిలో శ్రీ కళా వెంకటరావు గారు ఒకరు. 1920 ఆ ప్రాంతాలలో జాతిపిత గాంధీజీ దేశానికి పిలుపు ఇచ్చినప్పుడు వెంకటరావు గారు చదువు వదిలేసి రంగంలోకిదూకారు. అప్పటి నుంచి రెండు దశాబ్దాలకు పైగా ఆదిలో శ్రీ ప్రకాశం పంతులుగారి నాయకత్వాన, ఆ పిమ్మట శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి నాయకత్వాన ప్రజోద్యమంలో అగ్రగామియై నిల్చి కృషి చేశారు.

పార్టీపట్ల భక్తి విశ్వాసాలు

1950 ఆ ప్రాంతాలలో ఆంధ్రలో రాజకీయ "ఇజముల" ప్రమాదంవచ్చి పడినప్పుడు శ్రీ వెంకటరావుగారు దృఢ చిత్తులై తమ మాతృ సంస్థ పట్ల భక్తి విశ్వాసములు కలిగివుండి, క్రమశిక్షణగల సైనికునివలె వ్యవహరించి ఆ సంస్థ సుఖదుఃఖాలను పంచుకున్నారు. వ్యవస్థా నిర్మాణంలో అయనకు గల ప్రతిభా సామర్థ్యాలను యావద్భారతమూ గుర్తించి 1949-51 లో అఖిల భారత కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శి పదవిని ఆయన కిచ్చింది. సరిగ్గా అప్పుడే ఆంధ్రమాత గన్న మరొక ప్రతిభాశాలి—డాక్టర్ బి. పట్టాభి సీతారామయ్యగారు కాంగ్రెసు అధ్యక్ష పదవి నలంకరించారు.

1929—1946 మధ్య సంవత్సరాలలో కళా వెంకటరావుగారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శులలో ఒకరుగా పనిచేశారు. అప్పుడు వారు కాంగ్రెసును దక్షిణ భారతంలోనే బలీయమైన సంస్థగా రూపొందించారు. పార్టీ పెద్దలలో ముఖ్యుడు, వ్యవస్థా నిర్మాణంలో కౌశలం గల వాడు గనుకనే 1942 లో క్విట్ఇండియా ఉద్యమంలో ఆంధ్రలో జరిగిన పోరాటానికి వెనుకవున్న వ్యక్తి కళాయేనని దేశం గ్రహించింది. ఆయన రహస్యంగా తనపార్టీ వారికి జారీచేసిన సర్క్యులరు దేశమంతా మార్మోగి చివరకు ఇంగ్లండు పార్లమెంటులో కూడా ప్రస్తావన కొచ్చింది.

భూసమస్యల విషయంలో శ్రీ కళా వెంకటరావు గారికి ఎంత పరిజ్ఞానం కలదో దాన్ని పరిష్కరించవలెనన్న విషయంలో వారికి అంతే పట్టుదల వుండేది. అవిభక్త మద్రాసు రాష్ట్రంలో అయన రెవిన్యూ మంత్రిగా వున్నప్పుడు తెచ్చిన జమీందారీ రద్దు శాసనం చిరస్మరణీయమైంది. దానివల్ల ఆయన కాంగ్రెసు నాయకుల, ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు.

శ్రీ వెంకటరావుగారికి తెలిసినంతగా మరొక నాయకునికెవరికీ భూసమస్యలు తెలిసేవి గావని అన్నట్లయితే అది అతిశయోక్తి కాదు. కనుకనే నాగపూరు కాంగ్రెసు మహాసభ తీర్మానముల ననుసరించి సమగ్రమైన భూసంస్కరణల శాసనాన్ని తయారు చేసే పని ఆయనకు అప్పగించబడింది. తన కప్పగించిన పనిని పూర్తిచేసి రాష్ట్రంలో సేద్యదారులకు నవశకాన్ని ఆరంభింప జేయకుండానే

ఆయన మృత్యువాత పడడం రాష్ట్రానికే దురదృష్టకరమైన విషయం. అయితే ఒకందుకు మాత్రం సంతృప్తి చెందవచ్చు. ఏమిటంటే భూసంస్కరణలపై ఆసక్తి గల వారందరికీ ఆయన మార్గం చూపి వెళ్ళారు. అపారమైన అనుభవంతో ఆయన చూపిన మార్గం లాభదాయకమే కాగలదు.

రాజనీతిజ్ఞుడు

రాజకీయ వేత్తకు ముఖ్యగమ్యం అధికారం. కాబట్టి రాజకీయ వేత్త అయిన కళా వెంకటరావు గారు ప్రజాసేవా దృక్పథంతో అధికారం కోసం ఎత్తుకుపైయెత్తు వేసి ఎన్నో తంత్రాలుచేశారు. అవిభక్త మద్రాసు రాష్ట్రంలో కుమారస్వామిరాజా, రామస్వామి రెడ్డియార్ గార్ల మంత్రి వర్గాలలోనూ, ఆంధ్రలో బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి గారల మంత్రి వర్గాలలోనూ ఆయనను తప్పకుండా మంత్రిగా తీసుకున్నారంటే అది కేవలం ఆయన ప్రతిభా సామర్థ్యాలను దృష్టిలో వుంచుకొనేగాని మరొక కారణంచేత కాదు.

1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించినప్పుడు శ్రీ కళామధ్యవర్తి హోదాను తనకుతానే కల్పించుకొని ఆంధ్ర తెలంగాణా నాయకుల మానసిక సమైక్యతను సాధించడానికి కృషి చేశారు. వివేకి గనుకనూ, గొప్ప అనుభవజ్ఞుడు గనుకనూ, ఆయన సలహాలను అంతా విన్నారు. గోపాల రెడ్డి గారి మంత్రి వర్గంలో ప్లానింగు మంత్రిగాను, సంజీవరెడ్డిగారి మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రిగాను శ్రీ కళా తమ సహచరులకు ఎంతో బలం చేకూర్చడమేగాక తమ ముఖ్య మంత్రికి ఎంతో ప్రోత్సాహాన్ని, శక్తిసామర్థ్యాలను చేకూర్చారు.

పార్లమెంటరీ ప్రతిభ

దాదాపు ఇరవై యేండ్ల అనుభవం వల్ల శ్రీ కళా వెంకటరావుగారు నేటి తరంలో ఉత్తమ పార్లమెంటరీ వ్యక్తిగా శాసన సభల్లో రాణింపు కొచ్చారు. అనేక విషయాలలో సమగ్ర పరిజ్ఞానం, దానికితోడు ప్రతి విషయాన్ని చక్కగా విడమర్చి చెప్పగల విజ్ఞత—ఈ కారణాలవల్ల శాసనసభలో ప్రభుత్వ పక్షంవారికి పెద్ద అండగానూ, ప్రతిపక్షాల వారికి కొరకరాని కొయ్యగానూ ఉండేవారు. ఆయన విసిరే చలోక్తులు, మాటకు మాట తగిలించడం, రిపార్టీలు వీటన్నిటివల్ల చర్చ చాలా రక్తికడుతూ సభ్యులందరికీ ఆ దృశ్యం మళ్ళీ మళ్ళీ జ్ఞప్తికి తెస్తూవుండేది.

ఉత్తమ రాజకీయ వేత్తగా రూపొందిన వ్యక్తి కావడంచేత ఆయన ఎట్టి ఆవేశమూ, పిడివాదమూ లేకుండా అన్ని విషయాలనూ దూరదృష్టితో ఆలోచిస్తూ వుండేవారు. దున్నేవాడిదేభూమి అన్నది ఆయన ప్రగాఢ విశ్వాసం. కనుకనే ఎట్టి అరమరిక లేకుండా, వెనుక ముందాడ కుండా సహకార సేద్యం విషయంలో నాగపూరు తీర్మానాన్ని మనఃపూర్వకంగా బలపరిచారు. ఈ నాడు రైతాంగ వ్యవస్థలోవున్న దొసగులకూ, సమస్యలకూ సహకార సేద్యం చింతామణి వంటిదని ఆయన నమ్మకం.

త్యాగానికీ, సేవకూ అంకితమైపోయిన జీవితం శ్రీ కళా వెంకటరావుగారిది. కనుకనే జీవించి వుండగానే ఆయన ప్రజాభిమానానికి పాత్రులయ్యారు.

శ్రీ కళా వెంకటరావుగారు 1900 సంవత్సరం జులై 7 వ తేదీన జన్మించారు. బి. ఏ. తరగతి చదువుతూ వుండగానే చదువు వదిలేసి కాంగ్రెసు ఉద్యమంలో చేరారు. 1922 లో ఒక సంవత్సరంపాటు, 1930 లో మరొక సంవత్సరంపాటు, ఆ తరువాత మళ్ళీ ఆరు మాసాలపాటు కారాగారవాస శిక్ష అనుభవించారు. 1937 లో మద్రాసు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. తిరిగి 1941 లో ఆరు మాసాలపాటు జైలులో నిర్బంధింపబడి ఆ తరువాత నాలుగు నెలలపాటు డిటెన్షన్‌లో వుంచబడ్డారు. 1942 క్విట్ఇండియా ఉద్యమంలో అరెస్టుగావింపబడి 1945 వరకు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద డిటెయిన్ చేయబడి, ఆ పిమ్మట విడుదలగావింపబడ్డారు.

శ్రీ కళా 1939 నుంచి 1946 వరకు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1946 లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఎన్నికై

రెవిన్యూమంత్రిగా నియమింపబడి 1947 మార్చి నుంచి 1949 జనవరి వరకు ఆ పదవిలో వున్నారు. ఈ పదవీకాలంలోనే శ్రీ కళా వెంకటరావుగారు జమీందారీల రద్దు బిల్లును శాశనసభలో ప్రవేశ పెట్టి ఆమోదింపజేశారు. 1949 నుంచి 1951వరకు భారత జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1950-51 లో పార్లమెంటు సభ్యులుగా వున్నారు.

1951 సెప్టెంబరు నుంచి 1952 ఫిబ్రవరి వరకు మద్రాసు రాష్ట్ర ఆరోగ్య మంత్రిగా పనిచేశారు. ఆంధ్ర కాంగ్రెసు ఉపాధ్యక్షులుగా కూడా వుండి రాష్ట్రమంతటా "నీరా" గీతకు ప్రభుత్వం అనుమతి నిచ్చినందుకుగాను అసమ్మతి సూచకంగా ఆ పదవికి రాజీనామా ఇచ్చారు. 1955 మార్చిలో కొత్తపేట నియోజక వర్గం నుంచి ఆంధ్ర శాసనసభకు ఎన్నికయ్యారు.

తమకు షష్ఠిపూర్తి అయిన తరువాత - అనగా 1960లో తాము రాజకీయాలనుంచి విరమించి విశ్రాంతి తీసుకోగలమనీ, ఈ లోపల భూసంస్కరణల పనిని పూర్తి చేయాలనీ తాము సంకల్పించి నట్లు శ్రీ కళా వెంకటరావుగారు ఒకమారు అన్నారట. కనుకనే ప్రపంచంలోని వివిధదేశాలలోని భూమి అమరిక విధానాలను వారు క్షుణ్ణంగా పరిశీలిస్తూ వున్నట్లూ, చైనాలోని సహకార సేద్య పద్ధతులను కూడా వారు తెలుసుకొంటున్నట్లూ చెబుతారు.

శీత జ్వరంవొచ్చి లేవలేకుండా వున్న కారణంగా శ్రీ కళా వెంకటరావుగారు మృతి జెందడానికి రెండు రోజులు ముందు శాసనసభకు హాజరు కాలేదు. అయితే తమదగ్గరికి వచ్చేపొయ్యే మిత్రులతో మాట్లాడుతూనే వున్నారు. 1959 మార్చి 27 తేదీ రాత్రి 10-50 గంటల వరకు మిత్రులతో మాట్లాడి ఆ తరువాత పడుకొన్నారు. మార్చి 30 తేదీ సోమవారం నాటికి తాము శాసనసభకు హాజరయ్యే స్థితిలో వుండగలమనీ, ఆ తరువాత ఏప్రిల్ మొదటి వారంలో మచిలీపట్నం తదితర ప్రాంతాలకు పర్యటనకు వెళ్ళగలమనీ తమమిత్రులతో అన్నారు. రాత్రి 2 గంటలు ఆ ప్రాంతంలో నిద్రలేచి గుండెలో నొప్పిగా వున్నట్లు తమ సతీమణితో చెప్పారు. చికిత్స చేయడానికి డాక్టరు రాకముందే మృతి జెందారు.

ఈ సందర్భంలో మరొక హృదయ విదారక విషయం కూడా గుర్తుకొస్తుంది. ఏమిటంటే, ఒక సంవత్సరం క్రింద తమ తండ్రిగారు చనిపోయి నప్పుడు శ్రీ కళా వెంకటరావుగారు తండ్రిగారి మృతకళేబరాన్ని ఏ మార్గం గుండా ముక్కామల తీసుకెళ్ళారో సరిగ్గా ఆ మార్గంగుండానే శ్రీ వెంకటరావుగారి భౌతిక శరీరం కూడా అంత్యక్రియల నిమిత్తం 1959 మార్చి 28 తేదీన తీసుకుపోబడింది.

ఏ పరిస్థితులలోనూ

వెనుకంజ వేయని వీరాగ్రేసరుడు

"శ్రీ కళా వెంకటరావుగారు స్వర్గస్థులయ్యారు. నిశిరాత్రి ప్రశాంతతలో నిశ్శబ్ద మౌనంలో భూమాతకు వీడ్కోలుచెప్పి దేవతల స్వాగతాన్ని అందుకున్నారు. ఆయన నిశ్చలత్వానికి మూర్తి. మృత్యువు పిలుపుకు కూడా అదే నిశ్చలత. అదే ప్రసన్నవదనం. ప్రకాశంగారి తర్వాత ప్రకాశం అంతటి వాడు అంటే అతిశయోక్తికాదు." అని ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి శ్రీ వెంకటరావు మృతికి విచారిస్తూ హైద్రాబాదు ఆకాశవాణిద్వారా జోహార్లర్పించారు. ఆయన ఇంకా యిలా అన్నారు:

"1921 నుంచి జాతీయ ఉద్యమంలో ఆంధ్ర ప్రజల విశిష్ట ప్రతినిధిగా పేరు తెచ్చుకొన్నాడు. నవభారతంలో నవ్యాంధ్రను ఒక పూవుపూసి మేల్కొల్పి త్యాగదీక్షలతో అగ్రస్థానంలో అలరింపజేసిన మహాపురుషులలో వెంకటరావుగారు ఒకరు. జాతీయరంగాన్నే జీవిత రంగంగా ఆదినుంచి అంతవరకు చైతన్యవంతం చేసుకొన్న మహామేధావి. త్యాగం, సహనం, కార్యదీక్ష, దూరదృష్టి, నిశ్చలత, ఆత్మవిశ్వాసం......ఇవన్నీ ఆయనలో రాసిపోసుకున్నాయి. ఇరవై అయిదేళ్ళనుంచి నాకు ఆయన సాహచర్యం పెన్నిధిగా ఉంది. ఆయనతో కలిసి కాంగ్రెస్ సంస్థకు సంయుక్త కార్యదర్శిగా పనచేసేభాగ్యం నాకబ్బింది. మద్రాస్ ప్రభుత్వపు రెవెన్యూ మంత్రిగా వారు జమిందారీల రద్దు విషయంలో చేసిన కృషికి వారి వ్యతిరేకులు సైతం ప్రశంసించక తప్పలేదు. జమీందారీలకు నాంది చేసినవాడు కారన్ వాలీసు. వాటికి స్వస్తి చెప్పినవాడు శ్రీకళా వెంకటరావు. అందుకే కారన్ వాలీస్‌నుంచి కళా వెంకటరావుదాకా అని అంటూ ఉండేవారు.

"1942 ఆగస్టు విప్లవంలో శ్రీ కళా వెంకటరావు గారికి ప్రత్యేక స్థానం ఉన్నది. ఆయన ఆ చరిత్రాత్మక సమయంలో కాంగ్రెస్ మన ఆంధ్రరాష్ట్రంలో గాండీవంలా పనిచేయటానికి కారకుడు. ఈ సందర్భంలో చివరకు లండన్ పార్లమెంటులో కూడా వారి పేరు వినపడింది.

"సహకార ఉద్యమంలోనూ వారిది విశిష్టస్థానం. ఉద్రేకాన్ని ఉపజ్ఞతో రంగరించిన ఉద్దండుడు. నిర్మాణాత్మకమైన దృష్టి వారిది. సుమారు యీ నలభై ఏళ్ళ దేశసేవలో ఎప్పుడూ ఒక అడుగు కూడా వెనుకంజ వేయని ధీరుడు. నిర్మల చరిత్ర వారిది.

"ఇంత పటిష్ఠత వారికెలా వచ్చింది? అది వారి మొక్కవోని సంకల్ప ప్రభావం వల్లనే. ఎట్టి స్వార్థానికి, పరిస్థితుల ప్రలోభానికి తలవొంచక పోవడంవల్లనే. అభిప్రాయ భేదాలు ఉండవచ్చు. కాని సంకల్ప శుద్ధిని శంకించడానికి వీలులేదు.

"నాకాయన ఆప్తుడేకాక మార్గదర్శకులు. కేవలం మంత్రివర్గంలో సలహా సంప్రదింపులివ్వడమే కాదు. నా స్వవిషయాల్లో కూడా నాకెప్పుడూ సలహాయిస్తూ, వెన్ను చరిచి ముందడుగు వేయించిన మహనీయుడాయన నాకు. రాష్ట్రానికే వీరి హఠాత్ నిర్యాణం తీరనిలోటు. నాకు ఒక్కసారి వెలుగు ఆరిపోయినట్లు ఉన్నది. ఇదినాకు పెద్ద అఘాతం. దెబ్బ. ఎంతో ముఖ్యమైన పట్టు సమయంలో నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయారు. విప్లవాత్మకమైన దేశానికి ఒక కొత్తరూపునిచ్చే తరుణంలో భూలోకంనుంచే నిష్క్రమించారు. క్షణం విరామలేకుండా నిత్యవ్యాధతో ఉన్నా

దేశానికి నిత్యమూ సేవచేస్తూవున్న వీరి కృషిలోంచి మనం ఉత్సాహాన్నీ, త్యాగశీలతనూ పొందాలి. (కళా) అనీ, (కళావారు) అనీ ఆయన్ను ప్రజలు ఆప్యాయంగా పిలుచుకొనేవారు. ఇప్పుడాయన దేవతల పిలుపందుకున్నారు, ధన్యుడాయన. వారి ఆత్మశాంతించుగాక.

"అగ్నిదేవా ఓరిని పరంధామానికి చేర్చు. వీరిని శాంతిలోకి తీసుకువెళ్లు. ఈ వేదసందేశం నా చివరి మాట."

మార్గదర్శకుడు

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి శ్రీ ఎ. భగవంతరావు దిగువ సందేశం పంపారు :

"మిక్కిలి పూజ్యులయిన మన నాయకులలో ఒకరయిన శ్రీ కళా వెంకటరావుగారి నిర్యాణంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలకి తీరని నష్టం సంభవించింది. ఆయన మేధావి, సమర్థుడయిన పరిపాలకుడు. మన రాష్ట్రపు యువతరం జీవితం అన్ని రంగాలలోనూ ఆయనను మార్గదర్శకంగా తీసుకుని పురోగమించాలి."

"ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక"

దిగ్గజము

లోక్‌సభ అధ్యక్షుడు శ్రీ అనంతశయనం అయ్యంగారు యిలా అన్నారు :

"ఆయన దిట్టలయిన ఆంధ్ర రాజకీయ నాయకులలో ఒకరు. దేశానికి అనేకరకాల సేవచేశారు. రాజ్యాంగ సభ సభ్యుడుగా, అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శిగా పని చేశారు. ఈ మహా దేశభక్తుని మృతికి ఆంధ్రులంతా యెంతో చింతిస్తారు."

కేంద్ర ప్రభుత్వ రెవిన్యూ, పౌర వ్యయాలశాఖ మంత్రి శ్రీ బి. గోపాలరెడ్డి యిలా అన్నారు. "శ్రీ కళా వెంకటరావుగారి దేశభక్తి అకుంఠితమయినది. ఆయనకు కాంగ్రెసు అమిత ప్రేమాస్పదమయినది. దానిని బలహీన పరచే పనిని ఆయన యెన్నడూ చేసి యెరుగరు. కాంగ్రెసు పిలుపునందుకుని 1921 లో బి. ఏ. చదువు మానివేసిన నాటినుంచి ఆయనతో నాకు బాగా పరిచయం వుంది".

"మద్రాసు ప్రభుత్వంలో రెవిన్యూ మంత్రి పదవిని బహు సమర్థతో నిర్వహించి జమీందారీల రద్దు చట్టాన్ని చేశారు. ఆయన మరణవార్త పెద్ద అఘాతంలా తగిలింది. ఆయన నిష్క్రమణ ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెసు ప్రభుత్వము, కాంగ్రెసు వ్యవస్థలకు గొప్ప నష్టం,

"నాకు ఒక్క విషయం తలచుకుంటే ఆశ్చర్యంగా వుంది. ఆయన 1947 లోనూ, 1955 లోనూ రెండుసార్లూ కూడా మార్చి 28వ. తేదీనే మంత్రి పదవినలంకరించారు. మార్చి 28వ. తేదీనే కాలధర్మం కూడా చెందారు"

దేశానికే తీరని నష్టం

"శ్రీ కళా వెంకటరావు యింత తొందరగా హఠాత్తుగా మనలనందరినీ విడిచి వెళ్లారని తలచడం కాని నమ్మడంకాని చాలకష్టం. దేశ పునర్నిర్మాణం జరుగుతున్న యీ క్లిష్టసమయంలో ఆయన నిర్యాణం ఆంధ్రదేశానికే కాక మొత్తం భారత దేశానికే తీరని నష్టం" అని డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు శ్రీ జి. లచ్చన్న తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు. "స్వాతంత్ర్యోద్యమంలో చాల సంవత్సరాలు ఆయనతో కలిసి పనిచేసే అదృష్టం కలిగింది. రాజకీయ సమస్యలపై కాంగ్రెసు లోపలా బయటా ఆయనతో పోరాడే అవకాశమూ పొందాను. ఆయన మరణాన్నిగురించి ఆలోచించడం, నమ్మడం బహు కష్టంగా భరించరానిదిగా వుంది."

చేనేతవారికి తీరని నష్టం

శాసనసభ సభ్యుడు శ్రీ ప్రగడ కోటయ్యా, శ్రీ డి. రమాకాంతరావుగారలు శ్రీ కళా వెంకటరావు నిర్యాణం ముఖ్యంగా చేనేత పనివారికి పెద్దనష్టం అన్నారు. ఆయన మరమగ్గాలు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారన్నారు.

లోకసభ సానుభూతి

శ్రీ కళా వెంకటరావుపట్ల గౌరవ సూచకంగా లోకసభ మార్చి 28న ఒక నిమిషం మౌనం పాటించింది.

శ్రీ కళా వెంకటరావు ఆంధ్రప్రదేశ్‌లో సమర్థులయిన పరిపాలకులలోను, మంత్రులలోనూ ఒకరని అధ్యక్షుడు శ్రీ అనంతశయనం అయ్యంగారు అన్నారు. "ఆయన మృతికి సంతాపం చెందుతున్నాము. ఆయన కుటుంబానికి సంతాపం తెలియ చేయడంలో సభవారు నాతో కలుస్తారని నమ్ముతాను." అని ఆయన అన్నారు.

తరువాత సభ్యులు ఒక నిమిషం మౌనంగా నిలుచున్నారు.

ఆంధ్రవాణిజ్య సంస్థ తీర్మానం

స్వర్గీయ శ్రీ కళా వెంకటరావుగారిపట్ల గౌరవ సూచకంగా ఆంధ్ర వాణిజ్య సంస్థ మార్చి 28న మూసివేయబడింది.

అంతకు ముందు శ్రీ వి. ఎం పెరుమనార్ చెట్టి అధ్యక్షతన ఆ సంస్థ కార్యాచరణ సంఘం అత్యవసర సమావేశం జరిపి శ్రీ కళా వెంకటరావుగారు మొత్తంమీద దేశానికి ప్రత్యేకించి ఆంధ్రదేశానికి చేసిన సేవనూ, గౌరవ సభ్యుని హోదాలో ఆ సంస్థకు చేసిన సహాయాన్నీ వుల్లేఖిస్తూ సంతాప తీర్మానం చేసింది.

అఖిల భారత కాంగ్రెసు సిబ్బంది జోహార్లు

ఢిల్లీలో అఖిల భారత కాంగ్రెసు సంఘం సిబ్బంది ఒక సంతాప తీర్మానంలో శ్రీ కళా వెంకటరావు గారి మృతిపట్ల గాఢమయిన విచారం వెలిబుచ్చారు.

సంగ్రహంగా తీర్మాన పాఠం యిది. "శ్రీ కళా వెంకటరావుగారు చిరకాలంగా కాంగ్రెసు సంస్థకు సన్నిహితులయివున్నారు. వివిధ హోదాలలో ఆయన కాంగ్రెసుకి సేవచేశారు. ఆయన శేముషి, ధర్మనిష్ఠ, కష్టించి పని చేయగల శక్తి కాంగ్రెసుకి ముఖ్యంగా ఆంధ్రదేశంలో యెంతో బలంగా వుండేది. ఆయన మరణంతో ఆంధ్ర రాజకీయ రంగంలో యేర్పడిన లోటును పూరించడం కష్టం.

"అఖిల భారత కాంగ్రెసు కమిటీ సెక్రటేరియట్ వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నది."

రాష్ట్ర శాసనసభ జోహార్లు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు మార్చి 28న శోక సంతప్త హృదయాలతో సమావేశమయి స్వర్గీయ శ్రీ కళా వెంకటరావుగారికి జోహారులర్పించారు. ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి "కారన్ వాలీసు నుంచి కళావరకూ" ఒక శకమని చెబుతూ సమిష్టి మద్రాసు రాష్ట్రంలో చికాకు కలిగించే జమీందారీలరద్దులో వారు చేసిన అమోఘ సేవను ప్రస్తుతించారు.

ముఖ్యమంత్రి గద్గద స్వరంతో శ్రీ కళా వెంకటరావు "నా సఖుడు, తత్త్వవేత్త, మార్గదర్శి" అని చెప్పిన మాటలను సభవారు నిశ్శబ్దంలో మునిగి విన్నారు. ముఖ్యమంత్రి యిలా అన్నారు. "ఆయన 1921 లోనే గాంధీజీ పిలుపునుసరించి కళాశాలను ఒదిలిపెట్టారు. మరొక్క యెనిమిది రోజులు కళాశాలకు వెడితే హాజరు కావలసిన రోజులు పూర్తి అవుతాయి. అలాచేయమని చాలమంది మిత్రులు చెప్పారు. కాని ఆయన కళాశాలనో, మహాత్మా గాంధీ పిలుపునో మన్నించాలి. ఆయన మహాత్మా పిలుపునే మన్నించారు. ఆయన ఆంధ్రరాజకీయ రంగంలో ప్రముఖ పాత్రవహించారు. అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శిగా మంచి ప్రజ్ఞ ప్రదర్శించారు. ఆమహనీయునితో రెండు దశాబ్దాలు పైగా సన్నిహితంగా వుండే అదృష్టం కలిగింది. ఆయన బుద్ధిచాతుర్యాన్ని, వాదనాపటిమనూచూచి, చతురమైన జవాబులను వింటే ఆశ్చర్యము కలిగేది. మద్రాసు రాష్ట్రంలో ఆయన జమీందారీల రద్దు పథకాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ కార్యదర్శిగా సర్క్యులర్‌లను జారీచేయవలసి వచ్చినప్పుడు విషయాన్ని సమగ్రంగా తెలుసుకొనేవారు. వాటిలో కొన్ని ఇంగ్లండు పార్లమెంటులో కూడా చర్చకు దారితీసేయి.

ఆయన ధృవతారవంటివారు - ఎంత కష్టమైన పనినైనా తేలికగా, అలవోకగా పూర్తిచేసేవారు. ఆయన తన జీవితంలోని కార్యకలాపాలను ఒక క్రమశిక్షణతో నడుపుకొనేవారు. ఆయనను చూచి ఇతరులు నేర్చుకొనవలసినది ఇదే. ఆయన జైలులో వున్నప్పుడు ఎక్కువగా పుస్తకాలను చదివి వాటిపై విపులమయిన నోట్సు వ్రాయడము అలవాటు చేసుకొన్నారు, ఇలా సర్వదా నేర్చుకుంటూ వుండే అలవాటువల్ల ఆయనకు అన్ని విషయాలూ కరతలామలకములయినవి. ఆయన చేసిన చట్టాలలో ఆయన స్వంత పరిజ్ఞానం యిమిడి వున్నది, ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయానికి ఆయన ఆరోగ్యం అంత బాగుండకపోయినా నాకోరికమీద మంత్రివర్గంలో చేరారు. ఆయన బహు పెద్ద బాధ్యతను వహించారు. 1960 నాటికి తాను పదవీవిరమణ చేయడానికి వీలు కలిగించాలని అటు తరవాత ఒక పెరమీకి పార్లమెంటుకి పంపాలని ఆయన అనేవారు.

"ప్రజాసేవా రంగంలోనే కాక నా స్వంత వ్యవహారాలలో కూడా ఆయన నాకు సలహా యిచ్చేవారు. రెవిన్యూ మంత్రిగా ఆయన భూసంస్కరణల విషయాన్ని చేపట్టారు. కాని ఆ చట్టం యింకా రూపొందు తుండగానే ఆయన మన మధ్యనుంచి నిష్క్రమించడం కేవలం విధివిహితం. ఎవరికయినా ఆయనతో భేదాభిప్రాయాలుండవచ్చు. కాని ఆయన సద్వర్తనను, నిజాయితీని యెవరూ శంకించ లేరు. ఆయనకు సంతానంలేదు. కాని ఆయన తన వెనుక అద్వితీయ మయిన యీ నిజాయితీని వదలి వెళ్లారు. ఆఖరి క్షణం వరకూ రాష్ట్రానికి సేవచేసే అవకాశం ఆయనకు లభించింది. ఆయన అడుగు జాడలలో నడిచి ఆయన అసంపూర్తిగా ఒదిలిన పనులను పూర్తి చేయడమే ఆయన ఆత్మశాంతికి మార్గము".

శ్రీ రావి నారాయణరెడ్డి (కమ్యూనిస్టు డెమోక్రాటిక్ లెజిస్లేచర్ గ్రూపు అక్టింగు నాయకుడు) శ్రీ కళా వెంకటరావు ఆలోచనలు స్పష్టమయినవని, ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా యెరిగిన ఆయన విజ్ఞాన సర్వస్వం వంటి వారనీ ఆయన మరణంవల్ల మొత్తం రాష్ట్రానికే వెలితి కలిగినదనీ అన్నారు.

డా. ఎమ్. చెన్నారెడ్డి (డెమోక్రాటిక్ పార్టీ నాయకుడు) యిలా అన్నారు: "ఆయన ప్రతిపక్షం వాదాలను సోదాహరణంగా యెంతో చాతుర్యంతో ఖండించేవారు. రాష్ట్ర విభజన సమయంలో ఆయన చాల శ్రమపడి పనిచేశారు. ఆయన చేసిన భూమి శిస్తు శాసనాలు యెంతో బాగున్నాయి. ప్రతి మంత్రి వర్గంలోనూ ఆయన మూల విరాట్టుగా పని చేసేవారు".

శ్రీ ఎమ్. సత్యనారాయణరాజు (సోషలిస్టు) యిలా అన్నారు: "ఆయన నిర్యాణ వార్త ప్రతి పౌరుని క్రుంగ దీసినది. ఆయన వ్యక్తిత్వం అయస్కాంతం వంటిది. దానితో ఆయన యితరులను జయించేవారు. అన్ని ముఖ్య విషయాలలోను ఆయన నిపుణమయిన సలహా యిచ్చేవారు".

శ్రీకృష్ణావతారం (ప్రజాపార్టీ) అలా అన్నారు: "శ్రీ వెంకటరావుగారి పేరు ఆంధ్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది: ఆయన వివిధ శాసనాల ద్వారా రైతులకు చేసిన మేలుకి వారు ఆయనకు యెంతో ఋణపడి వున్నారు. ఆయన భూమి కౌలు పద్ధతులలో ప్రత్యేక పరిజ్ఞానం సంపాదించారు. నాగపూరు కాంగ్రెసులో సహకార వ్యవసాయంపై జరిగిన చర్చలలో ఆయన తోడ్పాటు యెంతో వుంది."

శ్రీమతి అమ్మన్నరాజా (కాంగ్రెసు) అగ్రనాయకులలో ఒకరు, పెక్కు క్లిష్టసమస్యలను పరిష్కరించగల ధైర్యశాలి అయిన శ్రీ వెంకటరావు మృతికి చింతించారు. ఆయన సర్వదా కాంగ్రెసు ఐకమత్యానికై కృషి చేశారని శ్రీ ఎమ్. వెంకటరాజు (కాంగ్రెసు) అన్నారు.

ఇండియాలో భూమి కౌలు విధానాలపై ప్రామాణికులలో శ్రీ వెంకటరావుగారు ఒకరని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (స్వతంత్ర) అన్నారు.

శైశవావస్థలోనున్న రాష్ట్రానికి ఆయన సేవ యెంతగానో అవసరమయి వున్నదని శ్రీ మీర్ అహమ్మద్ ఆలీఖాన్ (కాంగ్రెసు) అన్నారు. ఆయన స్వచ్ఛ శీలులనీ యితరులకు ఆదర్శ ప్రాయు

లనీ శ్రీ ఎస్. రంగనాథ మొదలియార్ (కాంగ్రెసు) అన్నారు. వ్యతిరేక పరిస్థితులలో కూడా శ్రీ కళా వెంకటరావుగారు యెన్నడూ కలతచెంది యెరుగరనీ, ఆయన మత విశ్వాసం గాఢమయిన దనీ శ్రీ కల్లూరి సుబ్బారావు (కాంగ్రెసు) అన్నారు. ఆయనకు హరిజనులంటే సానుభూతి అనీ వారి అభివృద్ధిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారని శ్రీమతి సుమిత్రాదేవి (కాంగ్రెసు) అన్నారు. శ్రీ పి. వెంకటేశ్వర్లు (కడెల్రెఫ) శ్రీ వెంకటరావుగారితో తమ పరిచయాన్ని గురించి చెప్పి ఆయన దేశంకోసం సర్వస్వం త్యాగం చేశారన్నారు. సహకార సంఘాల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలను గురించి శ్రీ ప్రగడ కోటయ్య (కాంగ్రెసు) వివరించారు. శ్రీయుతులు ఇ. అయ్యపురెడ్డి, కే. కోటిరెడ్డి, ఆర్. ఎల్. ఎన్. దొర, ఎన్. రామచంద్రరాజు, జె. బి. ముత్యాలరావు (కాంగ్రెసు వాదులు) ఎ. బి. నాగేశ్వరరావు (ప్రజాపార్టీ) గారలు శ్రీ వెంకట రావుగారిని కర్మకుశలతగల యోధుడుగా పేర్కొని యువకులకు ఆయన ఆదర్శం కావాలన్నారు.

శాసనసభ అధ్యక్షుడు శ్రీ ఎ. కాళేశ్వరరావు ఆయన మరణంతో దాదాపు 'రథసారథి' లోపించి నట్లయినదనీ, కాబట్టి అందువల్ల కలిగిన నష్టం తీరేది కాదనీ అన్నారు. ఆయన ధర్మనిష్ఠ గొప్పదనీ ఆంధ్రలో ప్రతి వుద్యమంలోనూ ఆయన ముందు వున్నారనీ అన్నారు. ఆయన మరణంతో ముఖ్య మంత్రి అమూల్యమయిన సలహాదారును కోల్పో యారనీ, రాష్ట్ర సారథ్యంలో యిప్పుడు ఆయన బాధ్యత గురుతరమయినదనీ అన్నారు.

సభవారు ముఖ్యమంత్రి ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని ఆమోదించారు. ఆరోజు సభ వాయిదా వేయడానికి ముందు మౌనంగా రెండు నిమిషాలు నిలుచున్నారు.

'ధైర్యశాలి'

శ్రీ కళా వెంకటరావు నిర్యాణానికి సంతాపం వెలిబుచ్చుతూ రాష్ట్ర శాసనమండలి ఒక తీర్మా నాన్ని చేసి పిదప సభను మార్చి 30 వరకూ వాయిదా వేసింది.

శ్రీ వెంకటరావు అమూల్య సలహా తనకిక లభించదని తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి అన్నారు. "ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు కమిటీ జారీచేసిన ప్రసిద్ధమయిన 1942 సర్క్యులర్‌ను తాము తయారు చేశామని ఒప్పు కోవాలని సలహా యివ్వగల ధైర్యశాలి, శ్రీ కళా వెంకటరావు" అని ఆయన అన్నారు. ఫలితాలకు జంకి అసత్యమాడే స్వభావం ఆయనకు లేదని యిది ఋజువుచేసింది అన్నారు

పత్రికా ప్రపంచం జోహారులు

బహుముఖ ప్రజ్ఞాశాలి

"ఆంధ్రప్రభ" సంపాదకీయంలో యిలా వ్రాసింది:

"ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ శాఖామాత్యుడు శ్రీ కళా వెంకటరావుగారు కన్ను మూశారన్న వార్త కాంగ్రెసు వారికేకాక యావదాంధ్రలోకానికి అత్యంత విషాదకరం.

"కొన్ని సంవత్సరాలనుంచి శ్రీ వెంకటరావుగారి ఆరోగ్యం పట్టు తప్పిన కారణంగా ఆయన నిరంతర ఔషధ సేవ చెయ్యవలసిన అవసరం ఏర్పడినా, మంత్రిగా, ప్రముఖ కాంగ్రెసు నాయకుడుగా చివరి గడియలవరకు ఆయన ప్రదర్శించిన దీక్ష శక్తిని, ప్రజ్ఞా ప్రాభవాలనుబట్టి ఇంతలోనే ఆయనకు నూరేళ్లు నిండనలవని కాని, ఇంత హఠాత్తుగా కఠోరమైన ఆయన నిర్యాణ వార్తను దేశం వినవలసివుంటుందని కానీ మేము ఊహించలేదు.

"1921 లో ప్రారంభమైన సహాయ నిరాకర ణోద్యమం ఆంధ్రదేశమంతట వేలకొలది యువకు లను, విద్యార్థులను ఆకర్షించింది. అయితే 1947వరకు కొనసాగిన స్వాతంత్ర్య సమరంలో, సత్యాగ్రహ, శాసనోల్లంఘన కార్యక్రమాలలో ప్రభుత్వ నిర్బం ధాలను, ఇతర కష్ట నిష్ఠూరాలకు తాళలేక కాంగ్రెసునుంచి ఎందరో వైదొలగారు. మరి కొందరు రాజకీయాలకే పూర్తిగా స్వస్తిచెప్పారు.

"కాని, కళా వెంకటరావుగారు మాత్రం గాంధీజీ పూరించిన శంఖారావమాలించి కళాశాలను బహిష్క రించింది మొదలుకుని స్వాతంత్ర్యం చేకూరేవరకు-అంతే కాదు-నిన్నరాత్రి దేహయాత్ర ముగించేవరకు కూడా, దాదాపు 40 సంవత్సరాలు, కాంగ్రెసుకు వెన్నెముకగా నిలిచి, దేశసేవకే తన జీవితాన్ని అంకితంచేసిన ధన్యాత్ముడు.

"దేశంకోసం పలు బాధలపాలైనవారు, కారా గార శిక్షల ననుభవించినవారు, లాఠీదెబ్బలకు గురి యైనవారు, ఆస్తులను కోల్పోయినవారు త్యాగ ధనులనేకులున్నారు. అయితే శ్రీ కళా వెంకటరావు గారివలె కష్టాలను సహించడమే కాక, సత్యాగ్రహమే కానీ, శాసనసభా ఎన్నికలే కానీ, కాంగ్రెసు ఉద్య మాలన్నిటికి సారథ్యం వహించి అశేష భారతంలో ఆంధ్ర రాష్ట్రానికి పేరు ప్రతిష్ఠల నార్జించినవారు ఎందరో లేరు.

"కాంగ్రెసు సంస్థను పటిష్ఠం చెయ్యడంలో, కల తలను పరిష్కరించి కాంగ్రెసు వాదులంతా ఒకే తాటిపై నడిచేట్టు చెయ్యడంలో, కాంగ్రెసు సందే శాన్ని రాష్ట్రం నలుమూలలకు వ్యాపింపజెయ్య డంలో, ప్రత్యర్థుల మాయోపాయాలను ఛేదించి కాంగ్రెసు పార్టీకి విజయం సాధించడంలో అత్యంత సమర్థుడుగా పరిగణించబడడంచేతనే శ్రీ కళా వెంక టరావుగారు 1949 లోనే ఆల్ ఇండియా కాంగ్రె సుకు ప్రధాన కార్యదర్శిగా వరించబడినారు.

"మరొక విశేషం, కాంగ్రెసుకు సంబంధించినంత వరకు దేశారాధకులుగా, ప్రజానుకూలురుగా, త్యాగ మూర్తులుగా పేరందిన వారెందరో వున్నారు. కాని, అట్టి వారందరు శాసనసభలో రాణించలేదు. దేశ పరిపాలనలో దక్షులనిపించుకోలేరు. శ్రీ కళా వెంకటరావుగారో, కాంగ్రెసు కార్యధురంధరుడుగా ఎంతటి ఖ్యాతిని గడించారో శాసనసభ్యులుగా, మంత్రిగాకూడా అంతకు మించిన ప్రతిష్ఠను సంపా దించారు.

"1947 లో మొట్టమొదట సమిష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా నియమించబడి, అటుపిమ్మట మద్రాసు ప్రభుత్వంలోనేమి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలోనేమి ఆరోగ్య, పారిశ్రామిక, ఆర్థిక రెవిన్యూ శాఖలను ఆయన సమధిక ప్రజ్ఞా ప్రాభవాలతో నిర్వహించారు. వివిధ విషయాలలో

సమగ్రమైన పరిజ్ఞానాన్ని, పాండిత్యాన్ని సాధించి ఎదటివారిని నిరుత్తరులుగా చేయగలిగినారు.

"అన్నిటికంటె శ్రీ కళా వెంకటరావుగారి పేరును చిరస్థాయి చేయగల ఘనకార్యం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా జమీందారీ, ఇనాందారీల రద్దుకు అయన సాధించిన శాసనాలే. ఇట్టి సంస్కరణకు మొత్తం ఇండియా అంతటిలో మద్రాసును మార్గదర్శకంగా చేయజాలిన ఘనత శ్రీ వెంకటరావుగారే దక్కించుకున్నారు.

"ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ మంత్రిగా ప్రస్తుతం కాంగ్రెసు తలపెట్టిన భూసంస్కరణల విషయంలో కూడా శ్రీ వెంకటరావుగారు మంచి అభినివేశాన్ని, శ్రద్ధాభక్తులను కనపరిచారు. వారిచేతిమీదుగానే ఆంధ్రప్రదేశ్‌లో పై సంస్కరణ నెరవేరక పోవడం నిజంగా శోచనీయం."

"ఇన్ని విధాల దేశానికి సేవచేసిన దేశభక్తుడు, బహుముఖప్రజ్ఞాశాలి, ప్రజారంజకుడైన నాయకుడు 60 సంవత్సరాలు నిండకుండానే విగత జీవుడు కావడం ఆంధ్రజాతికే కాదు. అశేష భారతావనికే తీరని నష్టం"

శ్రీ కళా వెంకటరావు

"ఆంధ్ర పత్రిక" సంపాదకీయం వివరాలు యివి:

"రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకటరావు ఆకస్మిక మరణ వార్త ఆంధ్ర ప్రజాబాహుళ్యానికి అశనిపాతం లాంటిది. శ్రీ వెంకటరావు ఉత్తమ దేశభక్తుడు; అఖండ ప్రజ్ఞాశాలి; గంభీరమూర్తి; రాజకీయ దురంధరుడు; త్యాగధనుడు. దేశరాజకీయాలతో వీరిది దాదాపు నాలుగు దశాబ్దాల సన్నిహిత సంబంధం. మహాత్ముని శంఖారావం విని పిన్న వయస్సులోనే విద్యాభ్యాసానికి స్వస్తిచెప్పి రాజకీయాలలో ప్రవేశించారు. స్వతంత్రం రాక ముందు, వచ్చిన తరువాత కూడా దేశ రాజకీయ చరిత్రలో శ్రీ కళా వెంకటరావు అనేక ప్రముఖ స్థానాలు ఆక్రమించి తమ ప్రజ్ఞా ప్రాభవాలు ప్రదర్శించారు, దేశ స్వాతంత్ర్యోద్యమ నిర్వహణంలోనూ, స్వాతంత్ర్యా వతరణం తర్వాత అవసరమైన పార్లమెంటరీ వ్యవహారాల నిర్వహణంలోనూ కూడా వీరు సమాన దక్షత, చాకచక్యం చూపగలిగారు: కాంగ్రెస్ అగ్రనాయకుల శ్రేణికి చేరగలిగారు. దాదాపు ఏడేళ్ళపాటు (1939 - 46) ఆంధ్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగానూ 1949 మొదలు 1951 వరకూ అఖిల భారత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. సమిష్టి మద్రాసు రాష్ట్రంలో రెవిన్యూ మంత్రిగా, ఆరోగ్యశాఖ మంత్రిగా వ్యవహరించారు. వీరు రెవిన్యూ మంత్రి హోదాలో వుండగానే జమీందారీ రద్దు శాసనం అమలులోకి వచ్చింది. రాష్ట్ర భూస్వామ్య విధాన సంస్కరణల కార్యకలాపానికి ఇది నాంది ప్రాయమైన శాసనం; ఈ శాసనకర్తగా శ్రీ వెంకటరావు ఖ్యాతి శాశ్వతంగా నిలిచి పోతుంది."

"శ్రీ కళా వెంకటరావు సహజంగా భాషా రాష్ట్ర అభిమాని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధనకు విభజన సంఘ సభ్యుని హోదాలోనూ, తదితర విధంగానూ వీరు అపారమైన సేవచేశారు; అప్పటిలో ఎదురైన వివిధక్లిష్ట సమస్యల పరిష్కారానికి తమ అమూల్యమైన సలహాలద్వారా చాలా సహాయపడ్డారు. ఆంధ్ర రాష్ట్ర మంత్రి వర్గంలో కొంత కాలం ప్లానింగ్ మంత్రిగా పనిచేసి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తిరిగి రెవిన్యూ మంత్రి అయినారు. భూసంస్కరణల విషయంలో మొదటి నుంచీ వీరికి శ్రద్ధా, ఆసక్తీ హెచ్చే. దేశదేశాల భూమి అమరకపు విధానాలనూ క్షుణ్ణంగా పరిశీలించారనే ఖ్యాతి నార్జించారు. దేశవ్యాప్తంగా భూసంస్కరణలు అమలు జరపదలచిన ఈ సమయంలో వీరి పరిజ్ఞానం, విశేషానుభవం రాష్ట్రానికే దేశానికీకూడా ఎంతైనా ఉపయోగపడేవనడంలో సందేహంలేదు. ముందు జమీందారీ వ్యవస్థను, తర్వాత ఇనాందారీ వ్యవస్థను ప్రత్యేక శాసనాలద్వారా రద్దుచేసిన శ్రీ కళా వెంకటరావు భూసంస్కరణల సమగ్రశాసనం తయారు గాకముందే అకాలమృతికి పాల్పడడం దురదృష్టమే.

శ్రీ కళా వెంకటరావును కేవలం సాధారణ రాజకీయ వేత్తల శ్రేణిలో చేర్చడం వారి ఉపజ్ఞను కించపరచడమే అవుతుంది, రాజనీతిజ్ఞుల శ్రేణికి చెందిన వ్యక్తి అని చెప్పడమే సమంజసం. రాజకీ

యాలతో ప్రమేయంవున్నవారు, లేనివారు కూడా మరచి పోదామన్నా మరపురాని వ్యక్తి శ్రీ కళా వెంకటరావు. ఆంధ్ర రాజకీయాలలో వీరి ఆకస్మిక మృతి ఫలితంగా ఏర్పడిన శూన్యత తొలగిపోయేది కాదు; వీరులేనిలోటు మనలను అడుగడుగునా ఎదుర్కొంటూనే వుంటుంది.

"దుఃఖంసాగరంలో మునిగివున్న శ్రీ వెంకటరావు కుటుంబానికి ఇదే మా హృదయ పూర్వక సానుభూతి."

కళా వెంకటరావుగారు

"గోలకొండ పత్రిక" సంపాదకీయంలో ఇలా అంది:

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవెన్యూ శాఖామాత్యులు శ్రీ కళా వెంకటరావుగారు నిన్నటి ఉదయం పరలోకగతులైరి. అకస్మాత్తుగా సంభవించిన యీ దుర్ఘటన యావదాంధ్ర దేశాన్ని దుఃఖ సముద్రంలో ముంచి వేసినది. ఒకటి రెండురోజులు కొద్దిపాటి జ్వరానికి గురియైనవారు. యీ విధంగా అస్తమించెదరని యెవ్వరూ కలలోనైనా ఊహించి యుండలేదు. ఈ దుర్వార్త హైద్రాబాదు నగరంలో వెంటనే వ్యాపించినా ఆవార్తను వెంటనే యెవ్వరూ విశ్వసింప శక్యము కాలేదు. నిన్నటి శాసనసభా సమావేశంలో కీర్తిశేషులను గురించి ఒకరి తరువాత ఒకరు పలువురు సభ్యులు ఉపన్యసిస్తూ తమ సంతాపాన్ని ప్రకటిస్తూ యుండినను అప్పటివరకు యెవ్వరూ యీ పిడుగువంటి సంఘటనయొక్క తాకిడి ప్రభావం నుండి బైటబడినట్లు కానరాలేదు. సంతాప తీర్మానాన్ని ప్రతిపాదించిన ముఖ్యమంత్రిగారితోపాటు సభ్యులందరి ముఖములు "కళ" దప్పి చైతన్యవిహీనమై నిర్ఘాంతపోయి శూన్యదృక్కులను ప్రసరిస్తూ యుండెనని చెప్పుట కూడ పరిస్థితిని సరిగా తెలియజేయుట కాదేమో! యథార్థముగా "కళా" లేనట్టి శాసనసభ సంపూర్ణంగా కళావిహీనమయ్యె. ప్రశ్నోత్తరాల సమయంలో నైతేమి తమ శాఖకు చెందిన చట్టాల ప్రతిపాదన సమయంలో నైతేమి యే యితర సమయంలో నైతేమి శ్రీ కళా వెంకటరావుగారు ప్రదర్శించే అద్వితీయమైన తెలివి తేటలు అసామాన్యమైన విజ్ఞాన సంపత్తి, అతి చురుకైన ఛలోక్తి ఒకసారి జ్ఞాపకం తెచ్చుకొంటే వారి గొప్పదనంతోపాటు ప్రభుత్వ రథాన్ని సాగించుటయందు వారిపాత్ర యెంత ప్రధాన మైనదిగా నుండెనో సుస్పష్టము కాగలదు.

"శ్రీ కళా వెంకటరావుగారి నిర్యాణమువల్ల లోటు యేర్పడినది కేవలం ప్రభుత్వంలోనే కాదు. కాంగ్రెసు మహాసంస్థకు వారు గత నలుబది సంవత్సరాలనుండి గావించిన సేవ రచయితలకు గ్రంథ రచనకు చక్కని ఇతి వృత్తముకాగలదు. విద్యార్థి దశలోనే గాంధీమహాత్ముని పిలుపు నందుకొని దేశ స్వాతంత్ర్య పోరాటములో దూకిన నాటినుండి ప్రాణాలు గోల్పోయే సమయం వరకు వివిధ రంగాలలో వివిధ హోదాలలో శ్రీ వెంకటరావుగారు గావించిన సేవ, యెదుర్కొన్న సమస్యలు, పాల్పడిన యిబ్బందులు, సాధించిన విజయాలు ఒక పర్యాయం సింహావలోకనం గావించుకొంటే యేమిటీశక్తి, యిది మానవశక్తియేనా లేక అణుశక్తియా? అనే ప్రశ్న ఉత్పన్నము కాగలదు. ఆంధ్ర రాజకీయాలలో, శ్రీ టంగుటూరి ప్రకాశం గారు 'ఆంధ్రకేసరి' యైతే శ్రీ వెంకటరావుగారు ఆంధ్ర చాణక్యుడని చెప్పుట అతిశయోక్తి కాజాలదు. శాసనసభలో తమ సంతాపాన్ని వెల్లడిస్తూ శ్రీ అయ్యపు రెడ్డిగారు చెప్పినట్లు ఆంధ్రజాతి చరిత్రలో యుగంధరుడు, తిమ్మరుసు, అక్కన్న మాదన్నలతోపాటు శ్రీ కళా వెంకటరావుగారి పేరు యుగ యుగాలుగా వర్ధిల్లగలదు. వారికీర్తి దినదిన ప్రవర్ధమానమై యశస్సు చిరస్థాయి నందుకొని నడవడి ప్రవర్తనలు ఆదర్శములు కాగలవు. సామాన్య దేశభక్తుడుగా, చిన్న కాంగ్రెసు కార్యకర్తగా, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శిగా ప్రధాన కార్యదర్శిగా, అఖిలభారత కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా, మద్రాసు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మంత్రిగా శ్రీ వెంకటరావుగారు గావించినకృషి ఫలితము సూర్యచంద్రాదులు వెలిగినంత కాలం ప్రజ్వలించి ఆంధ్రదేశానికి సహకరించగలదు."

"శ్రీ కళా వెంకటరావుగారు కార్యాచరణలో తమకుగల పట్టుదల ఆసక్తి ఆ అపేక్షలవల్ల తమ నలుబది సంవత్సరాల రాజకీయ జీవితంలో కొందరికి వ్యతిరేకంగా ప్రవర్తించుట తప్పలేదు. అయినా వారెన్నడునూ యీర్ష్యతోగాని కేవలం యితరులను నష్టపరిచే కించ దృష్టితోగాని సంచరించలేదు. ప్రతిపక్షాల నెదిరిస్తూ యుండినను తమ చాతుర్యమువల్ల వారికి బాధ కలగనివ్వలేదని ప్రతిపక్ష నాయకులే వెల్లడించుట శ్రీ వెంకటరావుగారి ఔదార్యమును చాటుచున్నది.

"భూమ్యాదాయ వ్యవహారాలలో శ్రీ వెంకటరావుగారిది అందె వేసినచెయ్యి. ఈనాడు మొత్తం భారతదేశంలో యీ విషయంలో వారిదే అగ్రస్థానమని చెప్పవచ్చును. ఆంధ్రప్రదేశ్ యేర్పడిన కొద్ది రోజులలోనే వారు ఉర్దూలో నున్న పూర్వ హైద్రాబాదు భూమ్యాదాయ చట్టాలన్నింటిని ఆస్వాదించుకొన గలిగిరి. కేవలం భూమ్యాదాయ వ్యవహారాలలోనేగాక సర్వ విషయాలలో విశేష విజ్ఞానాన్ని సంపాదించుకొని, నిరంతర విద్యార్థియై, అనేకమంది కాంగ్రెసు వాదులకు గురువుగారై యుండిరి. ఇక వారు లేనిలోటు తీరుపెట్లు? వారు మరికొన్ని సంవత్సరాలు జీవించినచో తాము తలపెట్టినట్లు 1960 లో రాజకీయాల నుండి దూరమై యితరులకు తర్ఫీదు నిచ్చెడివారేమో ! ఇప్పుడట్టి అవకాశం నశించినది.

"ఆంధ్రప్రదేశ్ యేర్పడిన యీ అల్పకాలంలో వారు తెలంగాణా ప్రజల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొన్నారని ఘంటా పథంగా చెప్పవచ్చును. తెలంగాణా ప్రాంతపు కాంగ్రెసు కార్యకర్తలకు తెలంగాణా మంత్రులకన్న శ్రీ కళా వెంకటరావుగారిపై అధికభక్తి విశ్వాసాలు యేర్పడినవని చెప్పుట సత్యదూరము కాజాలదు. నిజంగా యీనాడు తెలంగాణా కాంగ్రెసు కార్యకర్తలు అనాథులైనారని చెప్పవచ్చును.

"శ్రీ వారి ఆత్మకు పరమేశ్వరుడు శాంతిని ప్రసాదించుగాక".

అత్యంత విషాదవార్త

"ఆంధ్రజనత" సంపాదకీయంలో వ్రాసిన విషయాలు :

"ప్రభుత్వ భవనాలమీద జెండాలు విచార వదనాలతో తలలు క్రిందికి దించాయి. ప్రభుత్వ కార్యాయాలు మూసివేయ బడ్డాయి.

"కళా వెంకట్రావుగారు చనిపోయారన్న వార్త రాష్ట్రం అంతటా పొగలాగ వ్యాపించి ప్రతివ్యక్తినీ విచార మేఘాలు అలుముకున్నాయి.

"ఈ విచారాన్ని మాటలలో చెప్పడానికి వీలు లేదు. ప్రజా జీవితాన్ని చక్కదిద్దుతున్న ఒక వ్యక్తి హఠాత్తుగా ఆ ప్రజల మధ్యనుంచి అదృశ్యమైనపుడు సముద్ర గంభీరమైన ఆ విచారాన్ని మాటలలో చెప్పడం ఎలాగ ? హద్దుమీరిన విచారానికి మాటలు లేవు.

"కళా వెంకట్రావుగారు అస్తమించి రాష్ట్ర చరిత్రలో మహోజ్వలమైన ఒక అధ్యాయాన్ని వెంట తీసుకొని వెళ్ళిపోయారు. సంకల్ప సిద్ధుడు కనుక ఆయన మట్టుకు ఆయన ధన్యుడే. మనం మాత్రం విచారంతో మిగిలిపోయాం.

"ఈ విచారం ముఖ్యంగా యువతరానిది.

"ఆంధ్రి తెలంగాణా ప్రాంతాలు ఏకమై మనం కలలుకన్న విశాలాంధ్ర రాష్ట్రం సిద్ధించినప్పటికీ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు ఇంకా ఒక స్థిమితత్వానికి చేరలేదు. ప్రత్యేకించి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు ఇంకా అస్తవ్యస్తంగానే ఉన్నాయి. ఇది గాక నవ్యాంధ్ర రాష్ట్రం అభివృద్ధికి సంబంధించి అనుభవజ్ఞులు, పరిపాలనాదక్షులైన వ్యక్తుల సహాయంతో నెరవేర్చుకోవలసిన కార్యక్రమాలు గూడా బోలెడన్ని ఉన్నాయి. ఇట్టి పరిస్థితుల్లో అగ్రనాయక తరానికి చెందిన వ్యక్తులు ఒక్కరొక్కరే మనల్ని విడిచి వెళ్ళిపోవటం ఘోరమైన దురదృష్టమే.

"శ్రీ సంజీవరెడ్డిగారు అన్నట్టు కళా వెంకట్రావుగారు ప్రకాశం అంత తరువాత ప్రకాశం అంత మనిషి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణం, స్వాతంత్ర్య పోరాటం విషయాలు అలా ఉంచి పరిపాలనా దక్షతలో శ్రీ వెంకట్రావుగారు ఒక విధంగా ఆయనని మించిన వాడనటంలో అతిశయోక్తిలేదు.

"సత్యాగ్రహ పోరాటం నాటి అనుభవాలు, జైళ్లు, లాఠీ దెబ్బలు, ప్రకాశం శిష్యరికం, మంత్రి పదవులు, జమీందారీల రద్దు చట్టం ఇవన్నీ కలిసి శ్రీ కళా వెంకట్రావుగారు గతానికీ ప్రస్తుతానికి మధ్య వారధిలా విస్తరించుకున్న పరిపూర్ణమైన మనిషి.

"ఈయన నిష్క్రమణతో రాష్ట్రంలో "పెద్ద వాళ్ళతరం" ఇంచుమించు అంతరించింది. ఇక ప్రజా జీవితాన్ని నిర్దేశించవలసిన భారం ప్రస్తుతం ఉన్న యువనాయకులదే. అగ్ర నాయకుల సాన్నిహిత్యంలో గడించిన అనుభవాలను ఆదర్శంగా పెట్టుకొని రాష్ట్రభవితవ్యాన్ని వీరు చక్కదిద్దాలి."

కీ॥ శే॥ శ్రీ కళా వెంకటరావు

శ్రీ కళా వెంకటరావుగారికి జోహారులర్పిస్తూ "భారతి" యిలా వ్రాసింది :

"సమున్నతమైన శరీరం; స్ఫురత్తయిన రూపం; ఎత్తయిన నుదురు; చిలిపితనం చిందులాడే కళ్లు; వెడదనవ్వు, గాంభీర్యం త్రోద్రోపులాడుకొని వస్తున్నట్టున్న వదనం; ఇతరులతో ముచ్చటించే టప్పుడు కూడా నుదురు మీదనో, ముఖానికి అడ్డంగానో చేయి పెట్టుకొనే అలవాటు; తలవంచి పైకిచూస్తూ ఏదో ఆలోచనలో మునిగి వున్నట్టుగా కనిపించే వైఖరి; పరమార్థమో, పరిహాసమో, తెలియనీక తికమకపెట్టే మాటతీరు; అంతలోనే సందేహం నివారిస్తూ ఛలోక్తివిసిరే విధానం; గాంభీర్యం అసలు లోపించిందేమోనన్న అనుమానానికి ఆస్పదం కావాలని కల్పించే వాలకం; కోపంవచ్చినా, కోపం లోనూ దేనినోచూచి నవ్వుకొనే నాజూకు; చుట్టూ చేరేవారు ఎంత విచారంలోవున్నా ఇట్టే మరపింప జేసే మధురముద్ర...

"ఇలా చెప్పుకుపోతే ఎంతైనావుంది - అన్నిటినీ మించి ఆయన జీవితమంతా ఆక్రమించుకొని, ఏలాటి ఒడుదుడుకులు దొర్లినా లొంగకుండా చేసినది ఆ నవ్వుకొనేశక్తి. ఆయన గుణగణంలో ప్రధానమైనది అదే; చిట్టచివరివరకు ఎంత బాధనయినా ఓర్చుకొన గలిగేటట్టు చేసినదీ అదే; తనను సమీపించినవారి జీవితాలలోను, తుదకు రాజకీయ "శత్రువులు" అయినవారి జీవితాల్లో సహితం వెన్నెలలు వెదజల్లిందీ అదే; అదేవిశిష్టత శ్రీ కళా వెంకటరావు గారిలో.

"ఆ నవ్వు వెన్నెలపంటకు నారులు పోసినది అచంచల ధర్మనిష్ఠ; ప్రోదిచేసినది ప్రజాసేవాశక్తి; పరువు కలిగించినది పరిపాలనా వైదగ్ధ్యం.

"ఈ ధర్మనిష్ఠే ఆయనకు 14 ఏండ్లనూనూగు మీసాల ప్రాయముననే రాజకీయాలలో ఆసక్తి మొలకెత్తజేసింది; పట్టభద్రత ఫలోన్ముఖం కానుండగా 'విదేశీ' చదువుపై వైరస్యం కలిగించి, సహాయ నిరాకరణోద్యమంలో సారస్యం సంతరింప జేసింది; పలుమారు కారాగారవాస క్లేశం అనుభవింప జేసింది; జంకుగొంకులులేక గాంధీజీని మూపుపై మోసుకొని వెళ్లడానికి సాహస మిచ్చింది. "1929 లో గాంధీజీ ఆంధ్రదేశములో పర్యటించిరి. ఆ పర్యటనలో అమలాపురమునకు వచ్చిరి. అలమూరుదగ్గర గోదావరిని దాటునప్పుడు పడవ యొడ్డునకు రాకుండుటచే గాంధీజీని నేనును, కీ॥ శే॥ నరసింహ దేవర సత్యనారాయణ గారును భుజముపై నెక్కించుకొని నీటిని దాటించి యొడ్డునకు దింపితిమి. ఆ ఘట్టము జ్ఞాపకమునకువచ్చిన ఒడలు ఇంకను జల్లుమనుచున్నది. ఆ మహాత్ముని భుజముపై నెక్కించుకొన్న భారము మరపువచ్చుటెట్లు?" అన్నారు ఆయన.

"ఈ ధర్మనిష్ఠే ఆయనను ఎన్నిమార్లు భిన్నాభిప్రాయాలు కలిగినా, తను సేవచేసిన సంస్థను-ఎందరు వైదొలగినా-అంటిపెట్టుకొని ఉండేట్లు, దానిని ప్రతిష్ఠించేయడానికి అహర్నిశం పాటుపడేట్టు చేసింది."

"ఆయన ప్రజాసేవాసక్తికి తార్కాణ 'కారన్ వాలీసునుంచి కళా వెంకటరావు వరకు, అన్ననాను

డికి కారణమైన జమీల రద్దుచట్టం; భూమి సంస్కరణల శాసనానికి గట్టిపునాది."

"1942 లో ఆయన రూపొందించిన స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమం యావద్భారత ప్రజల ఆమోదంపొంది, బ్రిటిష్ పార్లమెంటులో ప్రశ్నల వర్షానికి కారుమబ్బు కావడమే ఆయన పరిపాలనా నైపుణ్యానికి నమూనా. మద్రాసు రాష్ట్రంలోను, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాతను, మూడు తెలుగు ముక్కలూ మరల ఏకమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిదపనూ ఆయన వివిధ మంత్రి పదవులను నిర్వహించి ప్రతిపక్షాలనుకూడా విజ్ఞతతో తనపక్షాలుగా చేసుకోగలగడం ఆయన పరిపాలనాపాటవానికి పరాకాష్ఠ. తన లక్ష్యాలన్నిటినీ ఆయన పూర్తి చేసుకొన్నట్టే - ఒక్కటి మినహాగా - షష్టిపూర్తి తర్వాత రాష్ట్ర రాజకీయాల నుంచి విరమిస్తానని ఆయన ఇటీవల అన్నారు. ఈ కోరిక ఒక్కటే మిగిలి పోయినది, ఆయన చిరయశస్సుతోపాటు."

ప్రజ్ఞానిధి

"ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రిక సంపాదకీయంలో యిలా వ్రాసింది. "స్వర్గీయ శ్రీ కళా వెంకటరావువలె పరిపాలనలో శాశ్వత ముద్రవేసిన మంత్రులు బహుస్వల్పం, మద్రాసులో ఆయన పెద్ద భూసంస్కరణచేసి శాశ్వత సెటిల్మెంటును తొలగించి సమస్త రాష్ట్రమంతటా రైత్వారీపద్ధతిని ప్రవేశపెట్టారు. అది యిప్పుడు భారతదేశంలో యుద్ధానంతర వ్యవసాయ సంస్కరణలకు అంకురార్పణగా గుర్తించబడుతున్నది.

"అమలాపురంతో ఆయనకుగల చిరకాల సంబంధంవల్ల ఆయనకు సహకారం పట్ల ఆసక్తిగలిగింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సహకారం, భూములు లేని పేదల విషయంలో ఆయన చేసినసేవను వుగ్గడించడం యెంతో సమంజసంగా వుంది. సాధారణ పరిపాలనలో ఆయనకుగల పరిజ్ఞానం, అనుభవంవల్ల ఆయనకు వాక్చాతుర్యం అలవడింది. ప్రతిపక్షాలు కూడా ఆయనకు జోహారులర్పించాయి.

"అన్ని స్థాయిలలోను స్థిరత్వాన్ని సాధించుటలో ఆయనకుగల నైపుణ్యాన్నిచూచి పెక్కుమంది యిప్పుడు ఆంధ్రరాజకీయాలకు కలిగినలోటును అంగీకరిస్తున్నారు. శ్రీ వెంకటరావుగారు తమ వివేకం, మితవాదనవల్ల అందరి ప్రశంసలను పొందేవారు. ఆయన విషయంలో సామర్థ్యంతో సద్వర్తన చేతులు కలిపినదని ప్రతిపక్షాలవారే ముందు ఒప్పుకునేవారు. కార్యరంగం నుంచి ఆయన హఠాత్తుగా నిష్క్రమించారు, కాని ప్రశాంతంగా నిష్క్రమించారు. జీవితంలో ప్రశాంతమయినదయే. గాంభీర్యంతో ఆయన అంతసాధించారో అపద్ధతికి అనుగుణంగానే ఆయన ప్రపంచాన్ని వీడినారని చెప్పవచ్చు."

పెద్దమనిషి

"డెక్కన్ క్రానికల్" యిలా అంది. "శ్రీ కళా వెంకటరావుగారు రాజకీయ పరిపాలనా రంగాలు రెండిటిలోనూకూడా పెక్కు ప్రముఖ పదవులను అలంకరించారు. ఆయన హఠాన్మరణంతో ఆంధ్రప్రదేశ్ పెన్నిధిని పోగొట్టుకున్నపేద అయిపోయింది. ఆయన వయస్సు 59 సంవత్సరాలు మాత్రమే కావడంవల్ల ఆయన అపమృత్యువు పాల్పడ్డారనాలి. స్వాతంత్ర్యోద్యమంలో మహాయోధుడుగా మసలిన తనయీడు యువకులకు వుత్తేజం కలిగించేవారు. దేశంకోసం ఆయన యెన్నోమార్లు ఖైదుకు వెళ్లారు. దూరదృష్టి, ఆత్మవిశ్వాసంగలవాడనీ, వివేకం, కృతనిశ్చయం కలవాడనీ ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి చేసిన ప్రశంసకు ఆయన అర్హుడు. అన్నిటికి మించి ఆయన పెద్దమనిషి, ప్రవర్తన, ఆశయాలు,కోరికలు వగైరాలలో కనీసం ఆయనకు సంబంధించినంతవరకు పెద్దమనిషి. ప్రశాంతమయిన స్వభావం. తొందరపడి నిర్ణయాలు చేయరు. గర్వాతిశయాలు లేవు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత మొదటిసారి మేము ఆయనను కల్సుకున్నప్పుడు జన్మతహా 'పెద్దమనిషి' అయిన వ్యక్తిని కలుసుకున్నాము అనుకున్నాం. ఆ అభిప్రాయం మార్చుకొనవలసిన అవసరం మాకు కలగలేదు."

దీనబాంధవుడు

"ఈవినింగ్ న్యూస్" పత్రిక యిలా వ్రాసింది: "ఆంధ్రప్రదేశ్ రెవిన్యూశాఖా మంత్రి శ్రీ కళా

వెంకటరావు మరణవార్త విని స్తంభించిపోయాము, చింతించాము. స్వాతంత్ర్య పోరాటంలో మహా యోధుడయిన వ్యక్తి నిర్యాణవార్త జంటనగరాలలో దావాలనంలా అలముకుపోయింది. నగరం విచారవార్ధిలో మునిగిపోయింది. 1921 లోనే మహాత్మాగాంధీ పిలుపు నందుకున్నవారిలో శ్రీ వెంకటరావుగారు ఒకరు. ఆయన అఖిలభారత కాంగ్రెసు కార్యదర్శిగా, సమష్టి మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా పనిచేశారు. స్వర్గస్తులయేసరికి ఆయన వయస్సు 59 సంవత్సరాలు మాత్రమే.

"ఈ సమయంలో వారి మరణంవల్ల యేర్పడిన లోటును తీర్చడం కష్టం. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన శ్రీ వెంకటరావు ఆంధ్రప్రదేశ్ కి గణనీయమయిన శక్తిగా వుండేవారు. యువకుడయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి పరిణతమయిన ఆయన సలహా విస్తృతమయిన అనుభవం యెంతో తోడ్పడేవి. కాబట్టి ఆయన మరణం మరీ బాధాకరం. ఆయన ఆర్తత్రాణ పరాయణుడు. మా విచారాన్ని వ్యక్తం చేయుటకు మాటలు దొరకడంలేదు. ఆయనసేవ యెక్కువగా అవసరమయిన తరుణంలో ఆయన యీ లోకాన్ని విడిచివెళ్లారు. మేము ఆయన కుటుంబం, రాష్ట్రం ముఖ్యంగా ముఖ్యమంత్రి విచారంతో పాలు పంచుకుంటాము.

"ఆయన ఆత్మ శాంతించుగాక".

నిజమయిన దేశసేవకుడు

"మెయిల్"పత్రిక యిలా అంది: "ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకటరావుగారి మరణంతో దేశం రాటుదేలిన పరిపాలకుని, దేశభక్తుని కోల్పోయింది. ఆయన దేశంకోసం చాల కష్టపడిన వెనకటితరానికి చెందిన కాంగ్రెసువాది, ఎనిమిది సార్లు ఖైదుకు వెళ్లారు మహాత్మాగాంధీ పిలుపువిని కళాశాలావిద్యాభ్యాసాన్ని విడిచిపెట్టారు. కాంగ్రెసు అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన పరిపాలనా సామర్థ్యం వెల్లడిఅయింది. సమష్టి మద్రాసు రాష్ట్రంలో 1947-49 మధ్య రెవిన్యూమంత్రిగా వున్నప్పుడు జమీందారీల రద్దు శాసనం తయారు చేశారు. ఆ విషయంలో ఆయన వహించిన ముఖ్య పాత్ర బహుశా ఆయన ప్రసిద్ధికి ప్రధాన హేతువు కావచ్చు. క్లిష్టము వివాదాస్పదము అయిన ఆ బిల్లును చట్టంచేయటంలో ఆయన చూపిన చాతుర్యం ఆ ముఖ్య సంస్కరణకు తగివున్నది. కారన్ వాలీసు ప్రవేశపెట్టిన జమీందారీల రద్దుతో ("కారన్ వాలీసు నుంచి కళావరకూ" అన్నమాటలను శ్రీ వెంకటరావుగారే కూర్చేరు). భూసంస్కరణల విషయంలో కాంగ్రెసు విధానంలో తొలి చర్య ఆరంభమయింది. రాష్ట్రం నాగపూరులో ఆమోదంపొందిన అంతకంటె ముఖ్యమయిన మార్పులను తేనున్న సమయంలో ఆయన దాటిపోవడం విచారకరం.

"గ్రామీణుల అభివృద్ధిపట్ల శ్రీ వెంకటరావుగారు బహుశ్రద్ధ వహించారు. ఆయనకు పెక్కు సహకార బ్యాంకులతో సంబంధంవుంది. ఎందువల్లనంటే అవి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ గలవని ఆయనకు తెలుసు. ఆయనకు విద్యాభిమానం కూడా మెండే. ఒక్క మాటలో. ఆయన దేశానికి నిజమయిన సేవకుడు. ఆంధ్ర ముఖ్యమంత్రి శ్రీ సంజీవ రెడ్డి ప్రశంసా వాక్యాలు పెక్కు హృదయాలలో ప్రతి ధ్వనిస్తాయి."

అపురూపమయిన వ్యక్తిత్వం

"డెయిలీన్యూస్"పత్రిక యిలాఅన్నది: "రెవిన్యూ మంత్రి శ్రీ కళా వెంకటరావుగారి అకాల హఠాన్మరణంతో దేశసేవకు అంకితమయిన ప్రతిభా వంతమయిన జీవితం అంతమయింది. ఆయన 1921 లోనే మహాత్మాగాంధీ పిలుపు నందుకుని స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. ఆ క్షణంనుంచి జీవితాంతం 40 సంవత్సరాలు జీవితాన్ని దేశసేవకి అంకితం చేశారు. సామాన్య పరిస్థితులలో పుట్టి పెరిగి ఆయన గట్టి కృషితో పైకి వచ్చారు. పైకి రాగోరేయువకులకు ఆయన ఆదర్శం కాదగును.

"పరిపాలనా దక్షుడుగా సమష్టి మద్రాసు రాష్ట్రంలో ఆయన చేసిన జమీందారీలరద్దు చట్టం ఆయనకు శాశ్వత కీర్తిని కలిగిస్తుంది. ఆయనకు విదేశాలలోని భూమి కౌలు విధానాలు సైతం

చక్కగా తెలుసును. భూసంస్కరణల కార్య క్రమాన్ని పూర్తి చేయాలని ఆయన కోరిక. నాగ పూరు నిర్ణయం పిమ్మట రాష్ట్రంలో క మ తా ల గరిష్ఠ పరిమితిని నిర్ణయించి సహకార వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టడానికి ఆయన చాక చక్యంతో పని చేస్తున్నారు. ఆయన వాక్చాతుర్యంగల పార్ల మెంటేరియను ఆయనపార్టీ విశ్వాసం గొప్పది. సర్వకాల సర్వావస్థలలోనూ ఆయన కాంగ్రెసుతో తాదాత్మ్యాన్ని మన్నించారు. ఉద్యమం నడప టంలో ఆయన అద్వితీయుడు. విదేశ పాలకులతో సంఘర్షణలు వచ్చినప్పుడు ఆయన మహా యోధుని వలె వ్యవహరించేవారు. 1942 లో జారీచేసిన ప్రసిద్ధ మయిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సర్క్యులర్ విష యంలో తనపాత్రను అంగీకరించగల ధైర్యశాలి."

"ఆయన పరేంగితజ్ఞానం, విషయజ్ఞత అరుదయి నవి. ఆయన దృష్టిలోనికి వచ్చిన సమస్యలన్నిటిని క్షణంలో గ్రహించేవారు. మంత్రివర్గంలో ఆయన మూ ల స్తం భ మే. మంత్రిగా తోటిమంత్రులకు యెంతోతోడ్పడేవారు. తాను శ్రీ కళా రక్షణ క్రింద పెరిగానని ముఖ్యమంత్రి అన్నమాటలలో అతిశయోక్తిలేదు. శ్రీ వెంకటరావుగారికి ఆంధ్రుల ప్రయోజనాలు ప్రియతమమయినవి. ఐ. ఎ. ఎస్. వంటి అఖిలభారత పోటీపరీక్షలలో తెలుగు అభ్య ర్థులు గెలవలేకపోతున్నందుకు ఆయన యిటీవలే ఆం దోళన వెలిబుచ్చారు. రాజనీతి, పరిపాలనాసామర్థ్యం, పార్లమెంటరీ వ్యవహారజ్ఞానం శ్రీ వెంకటరావులో అరుదుగా సమ్మేళన మయినవి. ఆయన అస్తమ యంతో ఆంధ్రప్రదేశ్ కి తీరని నష్టం వాటిల్లినది.'

ప్రేమగౌరవాలు

"దిస్ వీక్" పత్రిక యిలా వ్రాసింది. "శ్రీ కళా వెంకటరావు మరణానికి చాలమంది విచారం వెల్ల డించారు. ఆయన మంచివాడు. ఆయన సంఘానికి ఆయనపట్ల ప్రేమ, సహచరులకు గౌరవం. ఆయన యెప్పుడు చిరునవ్వు నవ్వుతూ వుండేవారు. ఇతరులు చెప్పుకునే యిబ్బందులను ఓపికతో వినేవారు. మనిషి, మాట, నిరాడంబరంగా వుండేవి. తనకు అప్పగించిన పనిని బహుసమర్థతతో నెరవేర్చేవారు. మొత్తం ప్రజలందరి ప్రేమాదరాలను పొందాలంటే నాయ కునికి వుండవలసిన లక్షణాలు యివే. వాటిని ఆయన నుంచి అలవరుచుకోవాలి."

—:oOo:—

ప్ర క ట న

అనివార్య కారణాలవల్ల "ఆంధ్రప్రదేశ్" ఏప్రిల్, మే (1959) నెలల సంచికలను ప్రచురింప జాలనందులకు చింతించు చున్నాము.

డైరెక్టరు,
సమాచార పౌరసంబంధముల
శాఖ

దేశంతోపాటు మీరుకూడా అభ్యుదయం పొందండి!

మీరు మిగుల్చుకున్న డబ్బును
భారత ప్రభుత్వ చిన్నమొత్తముల పొదుపు పథకమునకు
పెట్టుబడి పెట్టండి!

భారతదేశంయొక్క

సమాజాభివృద్ధి కార్యక్రమమునకు, గొప్పనదీలోయ ప్రాజెక్టులకు,
రైలుమార్గములు, రోడ్ల అభివృద్ధికి తోడ్పడండి!

మీ డబ్బును యీ క్రింది గ్యారంటీడ్ సెక్యూరిటీలలో దేనిలోనైనా పెట్టుబడి పెట్టండి!

12 సంవత్సరముల నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లు	పరిణతి పొందిన పిమ్మట నూటికి సంవత్సరానికి 5.41 వంతుల చొప్పున వడ్డీ ఇవ్వబడుతుంది. ఇవి రూ. 5 లవి మొదలు రూ. 5,000 లవి వరకూ లభిస్తాయి. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 25,000 ల వరకూ కొనవచ్చు.
10 సంవత్సరముల ట్రెజరీ సేవింగ్సు డిపాజిట్ సర్టిఫికెట్లు	ఏటా నూటికి 4 వంతులు వడ్డీ చెల్లించబడుతుంది. ఒక్కొక్కరు రూ. 50 లవి మొదలు రూ. 25,000 లవి వరకూ కొనవచ్చు.
పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకుఅకౌంట్లు	రూ. 25 ల నుంచి రూ. 10,000 ల వరకూ గల నిల్వలపై నూటికి $2\frac{1}{2}$ వంతులచొప్పునా, రూ. 10,000 లను మించిన నిల్వలపై నూటికి 2 వంతుల చొప్పునా వడ్డీ ఇవ్వబడుతుంది.

15 సంవత్సరముల ఆన్యూయిటీ సర్టిఫికెట్లు (రెండవ సీరీస్)

జారీచేయబడు ధరలు: రూ. 3,325, రూ. 6,650, రూ. 13,300 రూ. 26,600.	ఈ సొమ్ము, నూటికి సంవత్సరానికి కొంచెమెక్కువగా 4 వంతుల చొప్పున యిచ్చే చక్రవడ్డీతో సహా నెలసరి వాయిదాలలో 15 సంవత్సరాలలో తిరిగి చెల్లించబడుతుంది. వ్యక్తిగతంగా ఒక్కొక్కరు రూ. 26,600 ల వరకు కొనవచ్చు.

ఆదాయపు పన్ను లేకుండా మీకు మంచి ఆదాయం లభిస్తుంది!
భావి భారత సౌభాగ్యానికై పెట్టుబడి పెట్టండి!

ఇతర వివరములకు, యీ పెట్టుబళ్ళకి సంబంధించిన నిబంధనావళికొరకు:

నేషనల్ సేవింగ్సు కమిషనర్, నాగపూర్ చిరునామాకికాని లేక
రీజియనల్ నేషనల్ సేవింగ్సు ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు (దక్కన్)
చిరునామాకి కాని వ్రాయాలి.

"ఆంధ్రప్రదేశ్" ప్రకటన రేట్లు

—★—

'ఆంధ్రప్రదేశ్' పత్రికలో ఈ దిగువ రేట్లప్రకారం ప్రకటనలు స్వీకరించబడగలవు.

వివరాలు	మూడు భాషల పత్రికలకు			ఒక భాష పత్రికకు		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ	రూ	రూ	రూ	రూ	రూ
లోపలి పేజీ	200	125	75	100	55	30
వెనుకవైపు కవరు పేజీ	350	—	—	150	—	—
2, 3 కవరు పేజీలు	250	—	—	125	—	—

ఒక సంవత్సరం కొరకు స్థలమును కంట్రాక్టు తీసుకొన్నవారికి 20 శతి రిబేటు ఇవ్వబడుతుంది.

షరతులు

1. సాంకేతిక వివరాలు: 10¾ × 8½" డెమ్మి.
2. ముందరి టైటిల్ పేజీపై ప్రకటనలు వేయబడవు.
3. పావు పేజీకంటే తక్కువ ప్రకటనలు స్వీకరించబడవు.
4. ప్రకటించవలసిన విషయము, అది వేయబడవలసిన స్థలము మొదలగు వివరాలూ, దానికయ్యే మొత్తమూ ప్రతినెల 8వ తేదీలోపుగా ఈ కార్యాలయానికి చేరినట్లయితే, ఆ ప్రకటన మరుసటినెల పత్రికలో ప్రచురింపబడుతుంది. ప్రకటనకయ్యే మొత్తమును మనియార్డరు ద్వారాగాని, లేక క్రాస్ చేయబడని డిమాండు డ్రాఫ్ట్ద్వారాగాని పంపవలెను. డిమాండుడ్రాఫ్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధముల శాఖ డైరెక్టర్, హైదరాబాదు—దక్కన్ పేరిట వ్రాయబడవలెను
5. ప్రకటన నిమిత్తమై పంపబడు బ్లాకుల విషయంలో తగు జాగ్రత్త వహింపబడుతుంది. అయితే మిషను మీద బ్లాకులు గనుక పగిలిపోయినట్లయితే అందుకు ఈ శాఖ బాధ్యతవహించదు.
6. ప్రకటన ఎంత స్థలంలో ఏవైనం ప్రకారం వేయవలసింది, ఒక భాష పత్రికలో వేయవలెనా, లేక మూడు భాషల పత్రికలలో వేయవలెనా అనే వివరాలను స్పష్టంగా తెలియపరచాలి. ఉత్తర ప్రత్యుత్తరాలను, పైకమును ఈ దిగువ చిరునామాకు పంపవలెను.

డైరెక్టర్,
సమాచార, పౌరసంబంధముల శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాదు దక్కన్ — 1.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	...	1,06.041 చదరపు మైళ్లు
జనసంఖ్య	...	3,12 60,133
పురుషులు	...	1,47,42,912
స్త్రీలు	...	1,55,17,221
సగటు వర్షపాతము		
ఆంధ్ర ప్రాంతం	...	34.6 అంగుళాలు
తెలంగాణా	...	36.7 ,,
అరణ్య ప్రదేశం	...	1,40,26.000 ఎకరాలు
జిల్లాలు	...	20
తాలూకాలు	...	183
రెవిన్యూ సర్కిళ్లు	...	1,000
పట్టణాలు	...	293
గ్రామాలు	...	26.450
పంటల క్రింది ప్రవేశం	...	2.93,81,000 ఎకరాలు
1955-56 లో నీటిపారుదలను పొందిన ప్రదేశం	...	66.8 లక్షల ఎకరాలు
కౌళ్ల సంఖ్య	...	42.42.655
1955-56 లో ఉత్పత్తిఅయిన ఆహారధాన్యాలు	...	54.21 లక్షల టన్నులు
పాల ఉత్పత్తి	...	15 5 లక్షల గేలన్లు
రైలుమార్గాలు	...	2,902 మైళ్లు
జాతీయ రహదార్లు	...	1,409 ,,
రాష్ట్ర రహదార్లు	...	2,072 ,,
జిల్లా పెద్దరోడ్లు	...	2.527 ,,
జిల్లా ఇతరరోడ్లు	...	3,458 ,,
పాఠశాలలు	...	28,000
కళాశాలలు	...	64
వృత్తి విద్యా కళాశాలలు	...	31
ద్వితీయ పంచవర్ష ప్రణాళిక ప్రమాణం	...	రూ 175.37 కోట్లు

1958-59 బడ్జెట్టు :

ఆదాయం	...	రూ 63.66 కోట్లు
వ్యయం	...	,, 62.87 ,,
పెట్టుబడి ఖర్చు	...	,, 2 .29 ,,

